ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
గురువారం 15 మే 2025



రాగల ఐదు రోజుల్లో మోస్తరు వర్షం

అనకాపల్లిఅగ్రికల్చర్, మే 14(ఆంధ్రజ్యోతి):
రాగల ఐదు రోజుల్లో జిల్లాలో ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉండి, తేలికపాటి నుంచి మోస్తరు వర్షం పడే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ సీహెచ్.ముకుందరావు బుధవారం తెలిపారు. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 36.6 నుంచి 38.3 డిగ్రీల వరకు నమోదు అయ్యే అవకాశం వుందని చెప్పారు. మామిడి కాయలను పండు ఈగ ఆశించే అవకాశం ఉందని, వీటి నివారణకు మిథైల్ యూజినాల్‌ను లీటరు నీటికి రెండు ఎం.ఎల్ చొప్పున కలిపి ప్లాస్టిక్ ప్లేట్లలో పోసి తోటలో ఐదారు చోట్ల వేలాడదీయాలని ఆయన చెప్పారు.

గోవాడ షుగర్స్ భవిష్యత్తు ప్రశ్నార్థకం!

వచ్చే సీజన్‌లో క్రషింగ్‌పై నీలినీడలు

- చెరకు రైతులకు రూ.32 కోట్ల మేర బకాయిలు
- కార్మికులకు నాలుగు నెలల వేతనాలు...
- ప్రస్తుతం ఫ్యాక్టరీ గోదాముల్లో 20 వేల క్వింటాళ్ల పంచదార
- మార్కెట్‌లో విక్రయిస్తే వచ్చేది రూ.6 కోట్లే!
- ఆర్థిక సాయంపై ప్రభుత్వం నుంచి రాని భరోసా
- కార్యరూపం దాల్చని డిస్టిలరీ/ ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటు హామీ
- వచ్చే సీజన్‌పై అయోమయ స్థితిలో చెరకు రైతులు, కార్మికులు


గోవాడ షుగర్ ఫ్యాక్టరీ

చోడవరం, మే 14 (ఆంధ్రజ్యోతి):
సహకార చక్కెర ఫ్యాక్టరీలో ఒకప్పుడు నంబర్ వన్‌గా గోవాడ షుగర్ ఫ్యాక్టరీ భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. 25 వేల చెరకు రైతుల కుటుంబాలకు, వేయికిపైగా కార్మిక కుటుంబాలకు, మరెంతోమందిని ప్రత్యక్షంగా, పరోక్షంగా అండగా నిలిచిన గోవాడ షుగర్ ఫ్యాక్టరీ పరిస్థితి త్రిశంకు స్వర్గంలో పడింది. వచ్చే సీజన్‌లో ఫ్యాక్టరీ నడుస్తుందా? లేదా? అన్న సందేహం ఇటు రైతులు, అటు కార్మికుల్లో వ్యక్తం అవుతున్నది. రానున్న సీజన్‌లో క్రషింగ్ జరగకపోతే పండించిన చెరకు పంటను ఏం చేయాలో రైతులకు, కుటుంబాన్ని ఎలా నెట్టుకురావలో కార్మికులకు పాలుపోవడంలేదు.

గోవాడ షుగర్ ఫ్యాక్టరీ ఆర్థిక పరిస్థితి అత్యంత దయనీయంగా తయారైంది. గత క్రషింగ్ సీజన్ (2023-24)కు సంబంధించి చెరకు రైతులకు సుమారు రూ.4.75 కోట్లు చెల్లించాల్సి వుంది. ఇటీవల ముగిసిన 2024-25 క్రషింగ్ సీజన్‌కు సంబంధించి టన్నుకు రూ.3 వేల చొప్పున సుమారు 20 వేల టన్నులకు రూ.5.85 కోట్లు మాత్రమే యాజమాన్యం చెల్లించింది. ఈ సీజన్‌లో లక్షా తొమ్మిది వేల టన్నుల చెరకు క్రషింగ్ చేయగా.. మొత్తం రూ.27 కోట్లు బకాయి వుంది. పాత బకాయిలు కూడా కలుపుకుంటే రూ.32 కోట్ల వరకు రైతులకు చెల్లించాల్సి వుంది. ఇక కార్మికులకు నాలుగు నెలల వేతనాలు ఇవ్వవలసి ఉంది. ఇంకా పదవీ విరమణ చేసిన కార్మికులకు గ్రాట్యుటీతోపాటు, ఇతర బకాయిలు కూడా చెల్లించాలి. మరోవైపు ఇటీవల ముగిసిన సీజన్‌లో క్రషింగ్‌కు పలుమార్లు అంతరాయం కలగడం వల్ల ఆ ప్రభావం పంచదార ఉత్పత్తిపై పడింది. పంచదార రికవరీ ఐదు శాతానికి పడిపోయి 50 వేల క్వింటాళ్ల పంచదార మాత్రమే ఉత్పత్తి అయింది. దీనిలో నుంచి 30 వేల క్వింటాళ్ల పంచదారను విక్రయించి రైతులకు బకాయిలు చెల్లించినట్టు సమాచారం.

ఫ్యాక్టరీ గోదాములో ఇంకా 20 వేల క్వింటాళ్ల పంచదార మాత్రమే ఉన్నట్టు చెబుతున్నారు. దీని విలువ రూ.6 కోట్ల వరకు వుంటుంది. ఈ లెక్కన చెరకు రైతులకు, కార్మికులకు బకాయిలు చెల్లించడం అసాధ్యం. వీటికితోడు ఈ ఏడాది కోజనరేషన్ ప్లాంట్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి కూడా లేకపోవడంతో దాని ఆదాయం కూడా లేకపోయింది. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో ప్రభుత్వం నుంచి రూ.35-40 కోట్ల మేర ఆర్థిక సాయం అందితే తప్ప రైతులకు, కార్మికులకు చెల్లింపులు జరపలేరు.

కార్యరూపం దాల్చని హామీలు

గోవాడ షుగర్ ఫ్యాక్టరీ భవిష్యత్తుకు తమది పూచీ అని, డిస్టిలరీ లేదా ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని కూటమికి చెందిన ఎంపీ, ఎమ్మెల్యేలు హామీ ఇచ్చారు. కానీ ఆ దిశగా ఇప్పటి వరకు ఎటువంటి కార్యాచరణ కనిపించకపోవడంతో రైతులు, కార్మికులు నిరుత్సాహం చెందుతున్నారు. వాస్తవానికి గత సీజన్‌లోనే క్రషింగ్‌పై నీలినీడలు కమ్ముకున్నాయి. ఓవర్‌హాలింగ్ పనులు సకాలంలో, సక్రమంగా జరగలేదు. ఈ కారణంగా క్రషింగ్‌కు పలుమార్లు అంతరాయం ఏర్పడింది. చెరకు బండ్లతో కాటాల వద్ద రైతులు రోజుల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. దీంతో చెరకు ఎండిపోయి, సుక్రోజ్ (పంచదార) శాతం తగ్గిపోయింది. ఫలితంగా చెరకు క్రషింగ్ లక్షా తొమ్మిది వేల టన్నులకే పరిమితమైంది. పంచదార రికవరీ దారుణంగా ఐదు శాతానికి పడిపోయింది. దీనికితోడు చెరకు బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారో అర్థంకాని పరిస్థితి నెలకొంది. ఈ కారణాలతో చెరకు సాగుకు రైతులు ముందు, వెనుకా ఆలోచిస్తున్నారు. వచ్చే సీజన్‌లో ... మిగతా 8వ పేజీలో

నాడు అక్రమం.. నేడు సక్రమమా?

వైసీపీ హయాంలో భూ సమీకరణ మాటున పెద్ద ఎత్తున అక్రమాలు

- కోడూరులో 39.38 ఎకరాల ప్రభుత్వ భూమి తొమ్మిది కుటుంబాల సాగులో వున్నట్టు రికార్డుల్లో నమోదు
- పరిహారంగా ఎకరాకు 900 గజాలు కొట్టేయాలని ప్లాన్
- నాడు విపక్షాల ఆందోళనలు, ఫిర్యాదులు
- పట్టించుకోని అధికారులు
- కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత సీన్ రివర్స్
- వైసీపీ నేతలతో కూటమి నేత ఒకరు కుమ్మక్కు
- ప్లాట్లకు బదులుగా ఎకరాకు రూ.20 లక్షల నగదు పరిహారం
- కూటమి నేత ఒత్తిళ్లతో ఫైలుపై సంతకం చేసిన అధికారి
- రూ.6.27 కోట్లు విడుదల
- ప్రభుత్వ ఖజానాకు గండి


అనకాపల్లి మండలం కోడూరులో రైతులకు పరిహారం చెల్లించిన ఏపీఐఐసీ భూములు ఇవే!

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)
గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పేదలకు ఇళ్ల నిర్మాణాలు, పారిశ్రామిక వాడల ఏర్పాటు ముసుగులో పెద్ద ఎత్తున అక్రమాలు చోటు చేసుకున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఈ అక్రమాలపై విచారణ జరిపిస్తారని అంతా భావించారు. కానీ వైసీపీ నేతల బాటలోనే కొంతమంది కూటమి నేతలు నడుస్తున్నారు. వైసీపీ నాయకులు చేసిన భూసమీకరణ అక్రమాలకు వంతు పాడుతూ ప్రభుత్వ ఖజానాకు కన్నం పెట్టి, తమ జేబులు నింపుకొనే పనిలో నిమగ్నమయ్యారు. వివరాల్లోకి వెళితే..


ఆంధ్రజ్యోతి
భూ సమీకరణ ముసుగులో
వైసీపీ నేతల అక్రమాలు

వైసీపీ హయాంలో భూసేకరణ అక్రమాలపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం (ఫైల్ ఫొటో)

అనకాపల్లి కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటు తరువాత గత వైసీపీ ప్రభుత్వం పేదల ఇళ్ల నిర్మాణాలు, పారిశ్రామిక వాడల ఏర్పాటు పేరుతో అనకాపల్లి మండలంలో పెద్దఎత్తున భూసమీకరణ చేపట్టింది. మొత్తం 13 గ్రామాల్లో సుమారు 800 ఎకరాలు సమీకరించారు. డి.పట్టాదారులకు ఎకరాకు 900 గజాలు, సాగులో వున్న వారికి 450 గజాలు అభివృద్ధి చేసిన ప్లాట్లు ఇచ్చేందుకు నిర్ణయించారు. ఇదే అదనుగా భావించి ఒక మంత్రి అనుచరులు బినామీలను తెరపైకి తెచ్చి, వీరే సాగుదారులు అన్నట్టు రెవెన్యూ రికార్డుల్లో పేర్లు నమోదు చేయించారు. అనకాపల్లి మండలం కోడూరు రెవెన్యూ సర్వే నంబరు 20లో ఏపీఐఐసీకి చెందిన 39.38 ఎకరాల భూమి తొమ్మిది కుటుంబాల సాగులో వున్నట్టు రికార్డులు సృష్టించారు. వీరంతా వైసీపీ మద్దతుదారులు కావడం విశేషం. వాస్తవానికి డి.పట్టా భూములు అయిన వీటిని 2009లో ఒక వ్యక్తి, పట్టాదారుల నుంచి కొనుగోలు చేశారు. అయితే ఎన్‌వోసీ లేకుండా పట్టా భూములు కొనుగోలు చేయడంపై వివాదం చోటు చేసుకుంది. ఇది కొనసాగుతుండగానే భూములు కొనుగోలు చేసిన వ్యక్తి మృతిచెందాడు. దీంతో 2013లో అప్పటి రెవెన్యూ అధికారులు ఈ భూములు ప్రభుత్వానికి చెందినవిగా పేర్కొంటూ బోర్డులు ఏర్పాటు చేశారు. తరువాత ఈ భూములను ఏపీఐఐసీకి దఖలు పరిచారు. కాగా 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత వైసీపీ నేతల కన్ను ఈ భూములపై పడింది. 2022లో పేదలకు ఇళ్ల స్థలాలు, పారిశ్రామిక వాడ ఏర్పాటు కోసం ప్రభుత్వం భూ సమీకరణ చేపట్టింది. ఇదే అదనుగా భావించిన వైసీపీ మండలస్థాయి నేత ఒకరు కోడూరు సర్వే నంబరు 20లోని 39.38 ఎకరాలను ... మిగతా 8వ పేజీలో

అల్లూరి పార్కు సమగ్ర అభివృద్ధి

పర్యాటక శాఖ నిధులతోపాటు ఎంపీ ల్యాడ్స్

- ఇప్పటికే ఎంపీలు కలిశెట్టి, బీదా మస్తాన్‌రావు చెరో రూ.10 లక్షలు కేటాయింపు
- అత్యవసర పనులు 15 రోజుల్లో ప్రారంభం
- మిగిలిన ఎంపీలు కూడా నిధులు ఇచ్చే అవకాశం
- శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు
- పర్యాటక శాఖ అధికారులతో కలిసి అల్లూరి పార్కు సందర్శన


అల్లూరి పార్కులో సమాధులపైన పెచ్చులు ఊడిన శ్లాబ్‌ను అధికారులకు చూపిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

కృష్ణాదేవిపేట, మే 14 (ఆంధ్రజ్యోతి):
పర్యాటక శాఖ నిధులతోపాటు ఎంపీ ల్యాడ్స్‌తో కృష్ణాదేవిపేటలోని అల్లూరి సీతారామరాజు పార్కును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు చెప్పారు. బుధవారం ఆయన పర్యాటక శాఖ అధికారులతో కలిసి అల్లూరి పార్కును సందర్శించారు. అల్లూరి సమాధుల మందిరం పెచ్చులూడిన శ్లాబ్, శిథిలమైన పగోడాలు, నడక మార్గంలో లేచిపోయిన టైల్స్, వెలగని లైట్లు, ఇతర సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు పార్కుకు రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చేందుకు అవసరమైన అభివృద్ధి పనులు చేయిస్తామని చెప్పారు. తెలుగుదేశం పార్టీ గతంలో అధికారంలో వున్నప్పుడు అల్లూరి పార్కులో లక్షలాది రూపాయలతో పలు అభివృద్ధి పనులు చేయించినట్టు గుర్తు చేశారు. అయితే తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం వీటి నిర్వహణను పట్టించుకోకపోవడంతో పాడైపోయాయని అన్నారు. పార్కు అభివృద్ధి కోసం మంజూరు చేస్తామన్న నిధుల్లో ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని విమర్శించారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత అల్లూరి పార్కు అభివృద్ధి గురించి పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేశ్‌తో చర్చించినట్టు అయ్యన్నపాత్రుడు చెప్పారు. పార్కులో సోలార్‌లైట్ల ఏర్పాటు, ఒకేసారి 100 నుంచి 150 మంది భోజనాలుచేసేలా డైనింగ్‌హాలు, టాయిలెట్లు, తాగునీరు వంటి సదుపాయాలు ... మిగతా 8వ పేజీలో

స్కిల్ హబ్‌లతో ఉపాధి బాట

వృత్తి నైపుణ్య పెంపునకు ఉచిత శిక్షణ

- యువతీ యువకుల నుంచి పెరుగుతున్న ఆదరణ
- జిల్లాలో ఆరు కేంద్రాల్లో వివిధ కోర్సుల్లో శిక్షణ
- ఇంత వరకు 634 మందికి శిక్షణ.. 320 మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు


అనకాపల్లి మండలం రేబాకలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్‌లో శిక్షణ పొందుతున్న యువతీ యువకులు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)
వృత్తి నైపుణ్య పెంపు కోర్సులకు ఆదరణ పెరుగుతున్నది. యువతలో వృత్తి నైపుణ్యాన్ని పెంచడంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో ఆరు వృత్తి నైపుణ్య పెంపు కేంద్రాల(స్కిల్ హబ్‌లు)ను ఏర్పాటు చేశారు. వీటిల్లో 18 ఏళ్ల నుంచి 35 ఏళ్ల లోపు వారికి శిక్షణ ఇస్తున్నారు. 90 రోజుల పాటు ఇచ్చే శిక్షణలో ప్రతి బ్యాచ్‌లో 20 నుంచి 30 మంది వుంటారు. వృత్తి నైపుణ్యంపై నిపుణులైన వారితో శిక్షణ ఇప్పిస్తుండడంతో ఆయా కేంద్రాల్లో శిక్షణ పొందేందుకు యువత ఆసక్తి చూపుతున్నారు. సాంకేతిక నైపుణ్యం కలిగిన వృత్తిలో శిక్షణ ఇప్పించడంతోపాటు ఉద్యోగ మేళాలు నిర్వహిస్తుండడంతో పెద్ద సంఖ్యలో యువత ఉపాధి పొందుతున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత యువత వృత్తి నైపుణ్య అభివృద్ధి కోర్సుల్లో శిక్షణ పొందేందుకు ఆసక్తి చూపుతున్నారు. అనంతరం ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఉపాధి, ఉద్యోగాలు పొందేందుకు ఈ శిక్షణ ఎంతో దోహదపడుతున్నది.

అనకాపల్లి మండలం రేబాకలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల స్కిల్ హబ్‌లో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ డొమెస్టిక్ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు, ఎలమంచిలిలో శ్రీ గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, పాయకరావుపేటలో ప్రభుత్వ ఐటీఐలో అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ ఫ్యాబ్రికేషన్ కోర్సుల్లో ... మిగతా 8వ పేజీలో

సద్వినియోగం చేసుకోవాలి



జిల్లాలో యువత వృత్తి నైపుణ్యం పెంపు కోసం ప్రభుత్వం ఆరు స్కిల్ హబ్ సెంటర్లలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాం. 18 నుంచి 35 ఏళ్లలోపు వారు ఆయా కేంద్రాల్లో ఉచితంగా శిక్షణ పొందవచ్చు. శిక్షణ అనంతరం జాబ్ మేళాల ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం. ఈ అవకాశాన్ని అర్హులు, ఆసక్తి వున్నవారు సద్వినియోగం చేసుకోవాలి. వివరాల కోసం స్కిల్ హబ్ సెంటర్ల కోఆర్డినేటర్లను సంప్రదించండి.

ఎస్.గోవిందరావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి


వెడ్డింగ్ ఫొటోగ్రఫీలో నయా ట్రెండ్స్ - 8లో

వ్యవసాయంలో యాంత్రీకరణ

ఖర్చులు తగ్గి.. గిట్టుబాటు కానున్న పంటలసాగు

- చెరకులో యాంత్రీకరణకు ప్రాధాన్యం ఇవ్వాలి
- ఆర్ఏఆర్ఎస్‌లో ప్రత్యక్ష శిక్షణ
- వరి మాగాణుల్లో అపరాల సాగు లాభదాయకం

'ఆంధ్రజ్యోతి'తో ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ ముకుందరావు




చెరకులో యంత్రంతో అంతరకృషి

అనకాపల్లి అగ్రికల్చర్, మే 14 (ఆంధ్రజ్యోతి):
ఉత్తర కోస్తా వ్యవసాయ జోన్‌లో రైతులకు వ్యవసాయ యంత్రాల వినియోగంలో శిక్షణ ఇచ్చే కార్యక్రమాలను ప్రారంభిస్తామని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ సిహెచ్.ముకుందరావు తెలిపారు. బుధవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ, కూలీల కొరత, అధిక కూలి రేట్లతోపాటు పెట్టుబడులు పెరిగిన కారణంగా రైతులకు పంటల సాగు గిట్టుబాటు కావడం లేదన్నారు. ఇందుకు చెరకు సాగు ఒక ఉదాహరణ అని, అధిక పెట్టుబడి, వ్యయం కారణంగా చెరకు సాగు విస్తీర్ణం గణనీయంగా పడిపోయిందని వివరించారు. వరి సాగులో కొంతవరకు యాంత్రీకరణ జరిగిందని, చెరకులో ఆశించినంత లేదని చెప్పారు. చెరకులో కూడా యాంత్రీకరణకు ప్రాధాన్యం ఇస్తే సాగు విస్తీర్ణం కచ్చితంగా పెరుగుతుందని స్పష్టం చేశారు. చెరకు సాగులో నాట్లు వేయడం, బోదెలకు మట్టి ఎగవేత, కలుపుతీత, ఎండుటాకుల రెల్చడం, తదితర వివిధ పనులకు యంత్రాలను వినియోగించడం వల్ల కూలి ఖర్చులు బాగా తగ్గుతాయని ముకుందరావు చెప్పారు. ఈ ప్రాంతంలో చెరకు నరికే ... మిగతా 8వ పేజీలో

పాలిసెట్‌లో 94.98 శాతం ఉత్తీర్ణత

పరీక్షకు 8,511 మంది హాజరు

- 8,084 మంది పాస్
- బాలురు 4,650, బాలికలు 3,434 మంది

అనకాపల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి):
పాలీసెట్-2025 ఫలితాల్లో జిల్లా నుంచి 94.98 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులు అయ్యారు. గత నెల 30వ తేదీన నిర్వహించిన ఈ పరీక్షకు జిల్లా నుంచి మొత్తం 8,511 మంది విద్యార్థులు హాజరుకాగా వీరిలో బాలురు 4,972 మంది, బాలికలు 3,539 మంది వున్నారు. బుధవారం విడుదల చేసిన ఫలితాల్లో 8,084 (94.98 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో బాలురు 4,650 ((93.52 శాతం), బాలికలు 3,434 (97.03 శాతం) ఉన్నారు. జిల్లాస్థాయిలో నడకుర్తి మనోజ్ఞ (118 మార్కులు), చేబ్రోలు దీపిక (117 మార్కులు), యడ్ల భార్గవ తేజ (117 మార్కులు) వరుసగా మొదటి మూడు ర్యాంకుల్లో నిలిచారు.

జనవాణికి 50 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న ఎంపీడీవో ఉషారాణి

మునగపాక, మే 14 (ఆంధ్రజ్యోతి): సమస్యలపై పలువురి నుంచి జనవాణి కార్యక్రమం ద్వారా 50 దరఖాస్తులు వచ్చాయని స్థానిక ఎంపీడీవో ఎం.ఉషారాణి తెలిపారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం జనవాణి కార్యక్రమం జరిగింది. అర్జీదారులు నుంచి దరఖాస్తులను ఎంపీడీవో స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పలు సమస్యలపై సుమారు 50 వరకు దరఖాస్తులు వచ్చాయని, వాటిలో రెవెన్యూ పరమైనవి అధికంగా ఉన్నాయన్నారు. రోడ్లు, డ్రైనేజీలు, బ్రిడ్జిలు, ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు తదితర వాటి కోసం కూడా దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, జనసేన మండల అధ్యక్షుడు టెక్కలి పరశరాం, మొల్లేటి ఆనంద్, సూరిశెట్టి అప్పలనాయుడు పాల్గొన్నారు.

నేడు వాడనర్సాపురంలో దుర్గాలమ్మ జాతర



దుర్గాలమ్మ

రాంబిల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మత్స్యకార గ్రామమైన వాడనర్సాపురంలో గురువారం గ్రామ దేవత శ్రీ దుర్గాలమ్మ జాతర ఘనంగా జరుగనుంది. ఈ అమ్మవారిని స్థానికులే కాకుండా మరో ఆరు గ్రామాలకు చెందిన భక్తులు దర్శించుకుని పసుపు, కుంకుమలు సమర్పించుకుంటున్నారు. మొక్కులు తీర్చుకుంటారు. ఈ మేరకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. గుడి ఆవరణలో అన్నసమాధనతోపాటు, అమ్మవారి ప్రసాదాన్ని భక్తులకు అందించనున్నట్టు వారు తెలిపారు. ఈ జాతర సందర్భంగా క్రికెట్, వాలీబాల్, షటిల్ పోటీలను ఏర్పాటు చేసినట్టు గ్రామ పెద్దలు, యువకులు తెలిపారు.

ఫైబర్‌నెట్ సేవలు సక్రమంగా అందించాలి

అచ్యుతాపురం రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ యాజమాన్య సంస్థ అయిన ఏపీ ఫైబర్ నెట్ సేవలను ప్ర జలకు సక్రమంగా అందించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము బుధవారం ఒక ప్రకటనలో డి మాండ్ చేశారు. చార్జీల పేరుతో వినియోగదారుల నుంచి నెలకు రూ. 350 వసూలు చేస్తున్నారని, నెట్ మాత్రం సక్రమంగా రావడంలేదన్నారు. ఎప్పుడు టీవీలు ఆన్‌చేసిన ఎర్రర్ అని వస్తోందన్నారు. తక్కువ ఖర్చుతో ప్రజలకు నెట్టు, చానల్స్ అందిస్తామని మాటలు చెప్పి వినియోగదారులను ఇబ్బందులు పెట్టడం సరికాదన్నారు. ఈ విషయమై కేబుల్ ఆపరేటర్లను ఆశ్రయించినా తమకు సంబంధంలేదని తప్పించుకుంటున్నారన్నారు. బిల్లులు వసూలుపై మా త్రం శ్రద్ధ చూపుతున్నారని ఆయన ఆరోపించారు. సంబంధిత అధికారులు స్పందించి నాణ్యమైన ఫైబర్‌నెట్ సేవలు అందించేలా చూడాలని ఆయన డిమాండ్ చేశారు.

అర్చకుడు కృష్ణస్వామికి డాక్టరేట్



కృష్ణస్వామి

పాయకరావుపేట, మే 14 (ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని పాండురంగ స్వామి ఆలయ ప్రధానార్చకుడు ఈయుణ్ణి కృష్ణస్వామికి అమెరికాకి చెందిన అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ మేరైన్ గౌరవ డాక్టరేట్ ప్రకటించింది. కృష్ణస్వామి వైదిక స్మృతి, సనాతన ధర్మ పరిరక్షణ ప్రచారంలో సేవలందిస్తున్నందుకు గానూ గతేడాది డిసెంబరులో ఆ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఈ ఏడాది జనవరిలో జరిగే కాన్వొకేషన్‌కు అమెరికా రావాలని ఆహ్వానించారు. అయితే అనివార్య కారణాలతో తాను అమెరికా వెళ్లలేకపోయినట్టు కృష్ణస్వామి తెలిపారు. దీంతో డాక్టరేట్ పట్టాతో పాటు కోటు, టోపీని అమెరికా నుంచి కొరియర్ ద్వారా ఆ యూనివర్సిటీ పంపించిందన్నారు. ఈ పట్టాను గురువారం ఆలయ ప్రాంగణంలో దేవస్థానం, భక్త బృందం సంయుక్తంగా నిర్వహించనున్న అభినందన, సత్కార కార్యక్రమంలో శ్రీవిల్లిపుత్తూరు మ నవాళ మహాముని 23వ పీఠాధిపతులు, ఉత్తరాధికారి, శ్రీమత్ పర మహంస పరివ్రాజ కాచార్యులు శ్రీత్రిదండి శఠకోపముని రామానుజ జీయర్‌స్వామినుంచి అందుకోనున్నట్టు కృష్ణస్వామి తెలిపారు.

వ్యాస రచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు

నక్కపల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి): చదువుకుంటున్న పిల్లలకు సెల్ ఫోన్ అవసరమా ? అనే అంశంపై మండలంలోని చినదొడ్డిగల్లు శాఖా గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి కె.జనార్దన్ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరాలను విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా పిల్లలకు మొబైల్ ఫోన్ ఏమేరకు అవసరం అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో పలువు రుచిన్నారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు జూన్ ఆరో తేదీన బహుమతులు ఇస్తామని లైబ్రేరియన్ చెప్పారు.

గిరిజనుల పక్షపాతి సీఎం చంద్రబాబు

» విజయనగరం జోన్ ఆర్టీసీ చైర్మన్ దొన్నుదొర

అరకులోయ, మే 14 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గిరిజనుల పక్షపాతి అని విజయనగరం జోన్ ఆర్టీసీ చైర్మన్, టీడీపీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఏజెన్సీలో శత శాతం గిరిజనులకే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, జీవో 3కు ప్రత్యామ్నాయ జీవో అమలుకు కృషి చేస్తున్నట్టు ప్రకటించడంపై గిరిజనులంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ మేరకు టీడీపీ మండల అధ్యక్షుడు శెట్టి బాబూరావు, పెదలబుడు సర్పంచ్ పెట్టెలిదాసుబాబుల ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం నాలుగు రోడ్ల కూడలిలో చంద్రబాబు ఫ్లెక్సీకి పాలాభిషేకం చేపట్టి హర్షం వ్యక్తంచేశారు. సందర్భంగా దొన్నుదొర మాట్లాడుతూ గతంలో తెలుగుదేశం ప్రభుత్వమే జీవో 3 అమలులో తీసుకువచ్చి శత శాతం గిరిజనులకు ఉద్యోగ అవకాశాలు కల్పించినట్టు గుర్తు చేశారు.

ప్రధాన రహదారిపైనే మురుగు

» యానాద్రి కాలువ ఆధునికీకరణ పనులతో సమస్య



కొత్తపేట కాలనీ ప్రధాన రోడ్డు ఇంటి ఎదుట నిలిచిపోయిన మురుగు

ఎలమంచిలి, మే 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో కొత్తపేట కాలనీ ప్రధాన రోడ్డు పక్కనున్న మురుగు పేరుకుపోయింది. ఓ ఇంటి ఎదుట గత మూడు రోజులుగా డ్రైనేజీ కాలువలో మురుగు నీరంతా నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందికి గురికావాల్సి వస్తోందని ఆ గృహ యజమాని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యానాద్రి కాలువ ఆధునికీకరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఇందులో భాగంగా కొన్ని చోట్ల కాలువలను తాత్కాలికంగా మూసివేయడంతో ఈ సమస్య తలెత్తుతోంది. కొత్తపేట కాలనీ రోడ్డు పక్కన మూడురోజులుగా ఈ సమస్య తీవ్ర రూపం దాల్చడంతో దుర్వాసనతో బయటకు రాలేకపోతున్నట్టు పరిసర వాసులు వాపోతున్నారు. ఈ మార్గంలో రాకపోకలు సాగించేవారు సైతం ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సమస్య తలెత్తకుండా ఉండేందుకు అధికారులు ప్రత్యామ్నయ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

17న సైనిక కుటుంబాలకు సన్మానం

» చిన్నారుల్లో దేశభక్తి పెంపొందించేలా కార్యక్రమాలు

» మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రమాకుమారి

ఎలమంచిలి, మే 14 (ఆంధ్రజ్యోతి): దేశ రక్షణలో విశేష సేవలందిస్తున్న సైనికుల కుటుంబీకులను ఘనంగా సత్కరించడంతోపాటు, చిన్నారుల్లో దేశభక్తి ఇనుమడింప చేసేందుకు అన్ని వర్గాల ప్రజల సహకారంతో ఈ నెల 17 వ తేదీ శనివారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి అన్నారు. బుధవారం మునిసిపల్ కార్యాలయం ఆవరణలో కమిషనర్ ప్రసాదరాజుతో కలిసి విలేరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని నిర్మూలించేందుకు దేశ సరిహద్దుల్లో దేశ సైనికులు ప్రాణాలను సైతం పణంగా పెట్టి పోరాటం చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో వారి కుటుంబ సభ్యుల్లో మరింత మనోధైర్యం నింపేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించ తలపెట్టామన్నారు. రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యంతో ఆ రోజు మునిసిపాలిటీలో పరిధిలో ఉన్న సైనికుల కుటుంబాలను అందరినీ కలుస్తామన్నారు. జాతీయ స్ఫూర్తికి చిహ్నంగా వారి ఇళ్ల జాతీయ జెండాను ఎగరవేస్తామన్నారు. కుటుంబ సభ్యులను సత్కరిస్తామన్నారు. మునిసిపాలిటీ పరిధిలో ఇప్పటికే సైనిక ఉద్యోగులను గుర్తించారు. మూడు బృందాలుగా ఏర్పడి ఈ జై భారత్ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ఇందో అన్ని ప్రజా సంఘాలు, ప్రజలు, వర్తక, వ్యాపార తదితర ప్రజలు పాలుపంచుకోవాలన్నారు. దేశ సైనికులకు బాసటగా నిలవాలన్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మృతుని కుటుంబ సభ్యులకు పరామర్శ



ఉమ్మలాడలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే కన్నబాబు

మునగపాక, మే 14 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రైలు ప్రమాదానికి గురై మృతి చెందిన కరోతి గణేశ్ కుటుంబీకులను మాజీ ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు పరామర్శించారు.

ఉమ్మలాడలో మృతుని ఇంటికి బుధవారం వెళ్లారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకొని ఓదార్చారు. అనంతరం గణేశ్ అభిమానులు ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే కన్నబాబు వెంట జడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ, వైసీపీ నాయకులు ఆడారి గణపతి అచ్చిం నాయుడు, పిల్లి అప్పారావు, బొడ్డేడ లిల్లీ, మళ్ల కాశిసురేష్, బొడ్డేడ బుజ్జి తదితరులు ఉన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం రేపు

ఎస్. రాయవరం, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొరుప్రోలు సబ్‌స్టేషన్ పరిధి శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అనకాపల్లి ఈపీడీసీఎల్ ఈఈ కె రాజశేఖర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపా రు. విద్యుత్ లైన్లపై చెట్ల కొమ్మల తొలగింపు తదితర పనులు చేపడుతున్నందున గుడివాడ, సోముదేవుపల్లి, రేవుపోలవరం, చినఉప్పలంలోనిఆక్వా సర్వీసులు, కొరుప్రోలు కాయిల్ పరిశ్రమలతో పాటు గుర్రాజుపేట, లక్ష్మీపతిరాజుపేట, పెదఉప్పలం, చినఉప్పలం, వాతాడ, బంగారమ్మపాలెం గ్రామాల్లో వినియోగదారులు సహకరించాలని కోరారు.

టీడీపీ మండల అధ్యక్షుడిగా విజయ్ ఎన్నిక



పార్టీ పరిశీలకుడు, నాయకులుతో పెంటకోట విజయ్

మునగపాక, మే 14 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మం డల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా పెంటకోట విజయ్ ఎన్ని కయ్యారు. నియోజకవర్గ స్థాయిలో పార్టీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా బుధవారం పలు మండలాలకు అధ్యక్ష ఎన్నికలు అచ్యుతాపురంలో ఓ పంక్షన్ హాలులో నిర్వహించినట్టు విజయ్ తెలిపారు. టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే పప్పల చలపతిరావు అధ్యక్షతన జరిగిన ఈ ఎన్నికల్లో అధికారిగా బొండా జగన్ వ్యవహరించారని చెప్పారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు పరిశీలకునిగా వ్యవహరించారని చెప్పారు. నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడిగా, జిల్లా ఉపాధ్యక్షుడిగా విజయ్ అనేక పదవులకు ఎంపికయ్యారు. పార్టీ బలోపేతం లక్ష్యంగా బాధ్యతలు నిర్వహిస్తానని ఈ సందర్భంగా విజయ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కా ర్యానిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ, రాజాన రమేశ్‌కుమార్, మాజీ ఎంపీపీ ఆడారి మంజు, కడియం అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

నక్కపల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినదొడ్డిగల్లు జడ్పీ హైస్కూల్‌లో 1998-99లో టెన్త్ చదువుకున్న పూర్వ విద్యార్థులు 26 ఏళ్ల తరువాత ఆత్మీయ సమావేశంలో కలుసుకున్నారు. రేబాక గూడుపమ్మతల్లి ఆలయం వద్ద వీరంతా సమావేశమయ్యారు. ఆ నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. వారి కుటుంబసభ్యుల వివరాలు, క్షేమ సమాచారం తెలుసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఎంతో ఉత్సాహంగా గడిపారు. ఎంఈవో గాంధీ, నేమాని గోపాలకృష్ణ, నిర్మల, ప్రకాశరావు, శ్రీనివాసరావు తదితర ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించి గురుభక్తి చాటుకున్నారు. అనంతరం వీరంతా గూడుపమ్మ వారిని దర్శించుకున్నారు. పలువురు పూర్వ విద్యార్థులు ఏర్పాట్లు చేశారు.

ఉపాధి పనుల కల్పనలో తేడా వస్తే సహించం

సిబ్బందికి డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ పూర్ణిమాదేవి హెచ్చరిక



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న పీడీ పూర్ణిమాదేవి, అధికారులు

రావికమతం, మే 14 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పథకం పనులు కల్పించడంలో తేడా వస్తే సహించేది లేదని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ (పీడీ) పూర్ణిమాదేవి హెచ్చరించారు. మండలంలోని చీమలపాడులో ఉపాధి హామీ పథకం పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గిరిజన కూలీలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఉపాధి పనుల్లో కూలి గిట్టుబాటు కావడం లేదని, వారంలో ఆరు రోజులు పనిచేస్తే నాలుగు రోజులే మస్తర్లు వేస్తున్నారని సదరు కూలీలు సోమవారం రావికమతం మండల పరిషత్ కార్యాలయం ఎదుట పలుగు, పారలు చేతబట్టి ధర్నా నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పీడీ ఇక్కడికి వచ్చి పరిస్థితులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు కూలీలు మాట్లాడుతూ రోజంతా పనిచేస్తే రూ. 150 ఇస్తున్నారని, వారంలో ఆరు రోజులు పని చేస్తే నాలుగు రోజులే మస్తర్లు వేస్తున్నారని, ప్రభుత్వ ఆదేశాలు పాటించడం లేదని వాపోయారు. దీనిపై స్పందించిన పీడీ రోజు వారీ కూలి రూ.307 వచ్చేలా కూలీలకు మార్కింగ్ ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. పొలాలకు వెళ్లే రోడ్లు, కాలువలు, ట్రెంచ్‌ల తవ్వకాలు, పండ్ల తోటల పెంపకం వంటి పనులను గిరిజనులకు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవిందరావు కోరారు. పనులకు రానివారికి వీఆర్పీ పనికి వస్తున్నట్టుగా మస్తర్లు వేసి అవకతవకలకు పాల్పడుతున్నట్టు స్థానికులు పీడీకి ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపి తగిన చర్య తీసుకోంటామని ఆమె స్పష్టం చేశారు. ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు తవ్వించాలని వెలుగు సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకన్నబాబు, ఏపీవో చిన్నారావు పాల్గొన్నారు.

చోరీ కేసులో ముగ్గురి అరెస్టు



నిందితులతో ఎస్ఐ శ్రీనివాసరావు, సిబ్బంది

బుచ్చెయ్యపేట, మే 14 (ఆంధ్రజ్యోతి): వడ్డాది సబ్ పోస్టాఫీస్‌లో చోరీకి పాల్పడిన ముగ్గుర్ని అరెస్టు చేసినట్టు ఎస్ఐ ఎ.శ్రీనివాసరావు తెలి పారు. వడ్డాది ఎస్సీ కాలనీకి చెందిన ముగ్గురు యువకులు పోస్టాఫీస్‌లో 67,855 రూపా యల నగదును చోరీ చేసినట్టు చెప్పారు. సీసీ పుటేజీలను పరిశీలించి చోరీ చేసిన వారిని గుర్తించామని, వారిని పట్టుకుని నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ చెప్పారు. ఈ చోరీ కేసును ఛేదించడంలో హెడ్ కానిస్టేబుళ్లు అర్జున్, గణేశ్ వెంకట్ తదితరులు ప్రతిభ కనబరిచారని ఎస్ఐ తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్ఐ భాస్కరరావు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

నర్సీపట్నం, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమలాపురం గ్రామానికి చెందిన శెట్టి స్వామినాయుడుకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును స్పీకర్ అయ్యన్నపాత్రుడు అందజేశారు. వైద్య ఖర్చుల నిమిత్తం స్వామినాయుడుకు రూ.56,043 ప్రభుత్వం మంజూరు చేసింది. తన క్యాంప్ కార్యాలయంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు బుధవారం మంజూరు పత్రాన్ని లబ్ధిదారుడికి అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు లాలం శ్రీరంగస్వామి తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

'పార్టీని నమ్ముకున్న వారికే పదవులు ఇవ్వాలి'



సమావేశంలో టీడీపీ సీనియర్ నాయకులు

మునగపాక, మే 14 (ఆంధ్రజ్యోతి): తొలుత నుంచి తెలుగుదేశం పార్టీలో ఉన్నవారికే గ్రామ, మండల శాఖలకు అధ్యక్షులుగా అవకాశం ఇవ్వాలని ఆ పార్టీకి చెందిన పలువురు సీనియర్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక సహకార సంఘం వద్ద బుధవారం జరిగిన సమావేశంలో తీర్మానం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర తెలుగురైతు కార్యనిర్వాహక కార్యదర్శి దాడి మునిలినాయుడు మాట్లాడుతూ పరిశీలకుని పర్యవేక్షణలో టీడీపీ గ్రామశాఖలు ఏర్పాటు చేసి, ఆ తరువాత మండల అధ్యక్ష పదవికి ఎన్నిక నిర్వహించాలన్నారు. తీర్మాన పత్రాన్ని నియోజకవర్గం ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడుకు అందజేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో మొల్లేటి సత్యనారాయణ, కాండ్రేగుల నాయుడు, కె.వి.రాజశేఖర్, సబ్బి శ్రీను, ఉప్పేలు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన



కొత్తపేట శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాటు చేస్తున్న ధ్వజ స్తంభం

ఎలమంచిలి, మే 14 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి కొత్తపేటలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ ఆవరణలో బుధవారం ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తుల సమక్షంలో వేదపండితులు ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాలు పూర్తి చేసి అనంతరం జేసీబీ సహాయంతో ధ్వజ స్తాంభాన్ని ఆవిష్కరించారు. మహిళలు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమం అనంతరం భజనలు, కోలాటాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విస్తృతంగా వాహనాల తనిఖీ



కారు డిక్కీని తనిఖీ చేస్తున్న పోలీసులు

మునగపాక, మే 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రధాన రహదారి లో బుధవారం పోలీసులు వాహనాల తనిఖీ చేపారు. అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు మార్గంలో స్థానిక జంక్షన్‌లో కారులతో పాటు పలు రకాల వాహనాలను ఆపి తనిఖీ చేశారు. అన్ని పత్రాలను క్షుణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్.ఐ పి.ప్రసాదరావు మాట్లాడుతూ, రోడ్డు భద్రతా నిబంధనలు తప్పక పాటించాలన్నారు. విధిగా లైసెన్స్, ఇతర ధ్రువ పత్రాలు ఉంచుకోవాలని సూచించారు. లేకుంటే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం



కోనవానిపాలెంలో రైతులను సన్మానిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

ఎస్. రాయవరం, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపురం పంచాయతీ పరిధి కోనవానిపాలెంలో బుధవారం పెట్టుగోళ్లపల్లి యూనిట్‌కు చెందిన ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, స్థానిక రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సంఘం సమావేశంలో ప్రకృతి వ్యవసాయంపై చక్కగా వివరించిన రైతులు మామిడి నాగరాజు, కోన అప్పలరాజు, కోన గుర్రచార్యులను సన్మానించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రసాయన ఎరువులతో కాకుండా ప్రకృతి వ్యవసాయం ద్వారా సేంద్రియ ఎరువులతో పండించిన పంటలతో పూర్తి ఆరోగ్యంగా ఉంటామన్నారు.అందువల్ల ప్రతీ ఒక్కరూ ప్రకృతి వ్యవసాయం చేయాలని వారు సూచించారు. అనంతరం సిబ్బంది ఎంటీ తానుబాబు పీఎండీఎస్ ఉపయోగాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో రైతులు, వీఆర్పీ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది బుజ్జి, రాము, డీఎంఎంటీ కమల, కనకారావు, ఐసీఆర్పీలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'సంఘం శరణం గచ్ఛామి'

నర్సీపట్నం, మే 14 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ సృష్టికర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్ర ఆధారంగా రూపకల్పన చేసిన 'సంఘం శరణం గచ్ఛామి' నాటకం ఆద్యాంతం ఆకట్టుకుంది. బుధవారం సిటీ క్లబ్ ఆవరణలో కుల వివక్ష పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి ఆధ్వర్యంలో అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ కళాకారులతో ఈ నాటకం ప్రదర్శించారు. ముందుగా ఎంఈవో తులుపులు, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోటేశ్వరరావు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నాటక ప్రదర్శన ప్రారంభించారు. సంఘం శరణం గచ్ఛామి నాటకంలో అంబేడ్కర్ పాత్రలో కె.గోపి, రమాభాయి పాత్రలో ఎం.కవిత తమ నటనతో కట్టి పడేశారు. అంబేడ్కర్ జీవిత చరిత్రను కళ్లకు కట్టినట్టు ప్రదర్శించారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలు, కర్ణాటకలో 800 ప్రదర్శనలు ఇచ్చినట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో చిట్టియ్య, విశ్రాంత అచార్యులు యలమంద, విజయ్‌కుమార్, త్రిమూర్తులురెడ్డి పాల్గొన్నారు.

భూముల కొనుగోలుపై విచారణ చేయించండి

నర్సీపట్నం, మే 14 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో జగనన్న కాలనీల కోసం సేకరించిన భూముల కొనుగోలుపై విచారణ చేయించాలని టీడీపీ కౌన్సిలర్లు ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయం డీటీ అశోక్‌కు వినతిపత్రం అందజేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే గణేశ్ తన అనుచరుల ద్వారా నాలుగు మండలాలలో భూములు తక్కువ ధరకు కనుగోలు చేసి ప్రభుత్వానికి అధిక ధరలకు విక్రయించారని పేర్కొన్నారు. ప్రభుత్వాన్ని, రైతులను మోసం చేసి గణేశ్ లక్షల రూపాయలు దోచుకున్నారని ఆరోపించారు. దీనిపై ప్రభుత్వం సీబీడీ విచారణ జరిపించాలని కోరారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు దనిమిరెడ్డి మధు, డబ్బీరు శ్రీకాంత్ మాట్లాడుతూ జగనన్న కాలనీల కోసం భూములు ఇచ్చిన రైతులు నేరుగా తహసీల్దార్‌లకుగాని లేదా స్పీకర్ అయ్యన్నపాత్రుడు దృష్టికి తీసుకువస్తే న్యాయం చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెదిరెడ్ల చింతూ, రుత్తల కృష్ణ పాల్గొన్నారు.

జిల్లాలో 50 వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

▸▸ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

▸▸ క్రీడా పరికరాల పంపిణీలో ఇన్‌చార్జి కలెక్టర్ జాహ్నవి



విద్యార్థులకు క్రీడా పరికరాలను అందజేస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ జాహ్నవి

అనకాపల్లి కలెక్టరేట్, మే 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏర్పాటు చేసిన వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ ఎం.జాహ్నవి సూచించారు. కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం వేసవి క్రీడా శిబిరాల క్రీడాకారులకు పరికరాలను పంపిణీ చేసి మాట్లాడారు. జిల్లాలో 50 వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎల్‌వీ రమణ మాట్లాడుతూ జిల్లాలో ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరాలకు 982 మంది విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకున్నారన్నారు. వారిలో 612 మంది బాలురు, 370 మంది బాలికలు ఉన్నారన్నారు. వీరికి 20 క్రీడాంశాల్లో శిక్షణ అందిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు కోచ్‌లు పాల్గొన్నారు.

గాంధీనగరంలో చోరీ

▸▸ నాలుగున్నర తులాల బంగారు, 20 తులాల వెండి ఆభరణాలు అపహరణ

▸▸ పట్టణ పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు



ఆగంతకులు తాళాలు పగులగొట్టి నగలు అపహరించిన బీరువా



బాధితురాలితో మాట్లాడుతున్న సీఐ విజయ్‌కుమార్

అనకాపల్లి టౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఓ ఇంట్లో చోరీ జరిగినట్టు పోలీసులకు మంగళవారం రాత్రి ఫిర్యాదు అందింది. ఇందుకు సంబంధించి ఎస్ఐ ఎ.వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలివి. గాంధీనగరం ఇన్‌కంటాక్స్ వీధిలో నివాసముంటున్న కొమ్మోజు రాజేశ్వరి ఈ నెల 10వ తేదీన మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి కొప్పాకలోని కుటుంబ సభ్యుల వద్దకు వెళ్లారు. ఇంటి తాళాలు పగులగొట్టి ఉండడాన్ని మంగళవారం ఉదయం చూసిన పక్కింటి వారు రాజేశ్వరికి సమాచారం అందించారు. దీంతో రాజేశ్వరి, కుటుంబసభ్యులు ఇంటికి వచ్చి చూసి ఇంట్లోని బీరువాలో గల బంగారం, వెండి వస్తువులు చోరీకి గురైనట్టు గుర్తించారు. నాలుగున్నర తులాల బంగారు గొలుసు, గాజులు, చెవిదుద్దులు, 20 తులాల వెండి వస్తువులు అపహరణకు గురైనట్టు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ చెప్పారు.

అనకాపల్లిలో 'శుభం' చిత్ర యూనిట్ సందడి



విజయోత్సవ కేక్ కట్ చేస్తున్న చిత్రం యూనిట్ సభ్యులు

అనకాపల్లి టౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో 'శుభం' చిత్ర యూనిట్ సభ్యులు బుధవారం సందడి చేశారు. సత్యనారాయణ థియేటర్‌లో సినిమా విజయోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. దర్శకుడు కాంద్రేగుల ప్రవీణ్, నటులు హర్షిత్‌రెడ్డి, గవిరెడ్డి శ్రీనివాస్, చరణ్‌పేరి, శ్రియ కొంతం, శ్రావణలక్ష్మి, షాలినీ కొండెపూడి, వంశీధర్ గౌడ్‌లు కొద్దిసేపు ప్రేక్షకులతో మాట్లాడి సరదాగా గడిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.భానుచందర్, ఆడారి కుమార్, బుద్ద శ్రీనివాసరావు, సురేష్, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు : సీఐ

అనకాపల్లి టౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి) : మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ హెచ్చరించారు. నెహ్రూచౌక్‌లో మైనర్ల డ్రైవింగ్‌పై బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాలను నడుపుతున్న పలువురు మైనర్లను పట్టుకుని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ చేశారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం వల్ల తలెత్తే పరిస్థితులను వివరించారు. ప్రమాదాలు జరిగితే పరిస్థితి ఏమిటని వారిని ప్రశ్నించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమన్నారు. అనంతరం జరిమానాలను విధించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శేఖరం, సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ 'రొంగలి'ని పరామర్శించిన కొణతాల



శ్రీరామమూర్తితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

కొత్తూరు, మే 14 (ఆంధ్రజ్యోతి) : కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ ఎంపీపీ రొంగలి శ్రీరామమూర్తిని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ బుధవారం పరామర్శించారు. ఈ మేరకు అనకాపల్లి మండలం రొంగలివానిపాలెంలో ఉన్న ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట జనసేన పార్టీ నాయకులు భరత్‌బాబు, మేడిశెట్టి సత్తిబాబు, చదరం నాగేశ్వరరావు, నందారపు సూరిబాబు, జగదీష్ తదితరులు ఉన్నారు.

అసకపల్లి ప్రభుత్వ భూమిలో ఆక్రమణల తొలగింపు

సబ్బవరం, మే 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అసకపల్లి రెవెన్యూ పరిధి సర్వే నెంబరు ఒకటి కొండ పోరంబోకులో ఆక్రమణలను బుధవారం రెవెన్యూ సిబ్బంది తొలగించారు. తహసీల్దార్ బి.చిన్నికృష్ణ ఆదేశాల మేరకు ఆర్ఐ వీరయ్య, వీఆర్వో ఈశ్వరరావు, సిబ్బంది కలిసి ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన బేస్మెంట్లను కూల్చివేశారు. అనంతరం అక్కడ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు మాట్లాడుతూ అసకపల్లికి చెందిన కర్రి కనకరాజు ఈ ఆక్రమణలపై సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీని అందజేసిన నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టినట్టు చెప్పారు. ప్రభుత్వ భూములను ఆక్రమించేవారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

అక్రమార్కుల జేబు నింపుతున్న బోడిమెట్ట

▸▸ రాయపురఅగ్రహారంలో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు ▸▸ రాత్రివేళ సాగుతున్న ప్రక్రియ ▸▸ పట్టించుకోని రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం





అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్న రాయపుఅగ్రహారంలో బోడిమెట్ట వాలు ప్రాంతం

సబ్బవరం, మే 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాయపుర అగ్రహారం గ్రామంలోని బోడిమెట్ట వాలు ప్రాంతంలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. గత కొద్దిరోజులుగా మెట్ట చుట్టూ ఈ ప్రక్రియ కొనసాగుతున్నా కన్నెత్తి చూసేవారు కరువయ్యారు. దీంతో పలువురు స్థానిక నాయకుల సహకారంతో సదరు వ్యక్తులు ఇష్టానుసారంగా తవ్వకాలను చేపడుతున్నారని ఆరోపిస్తున్నారు. యంత్రాలతో తవ్వుతూ మట్టి, గ్రావెల్‌తో పాటు బేస్మెంట్ మెటల్ కూడా తరలిం చుకుపోతూ సొమ్ము చేసుకుంటున్నారని అంటు న్నారు. రాయపుర అగ్రహారానికి ఆనుకొని ఐఎంయూ, పెట్రో వర్సిటీలు ఉండడంతో ఆ ప్రాం తం ఇటీవల కాలంలో అభివృద్ధి చెందుతోంది. దీంతో నిర్మాణాలు, లే-అవుట్ల పనులు జోరందుకున్నాయి. ఫలితంగా గ్రావెల్‌కు డిమాండ్ ఏర్పడింది. గతంలో ఈ గ్రామంలో పేదలకు సర్వే నెంబరు 60 బోడిమెట్ట వాలు ప్రాంతంలో ఇచ్చిన జగనన్న లే-అవుట్‌ను అక్రమార్కులు ధ్వంసం చేసి గ్రావెల్‌ను తరలించుకుపోయారు. లక్షలాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి చేసిన లే-అవుట్‌ను ధ్వంసం చేయడమే కాకుండా అక్కడ ఏర్పాటు చేసిన ట్యాప్‌లు, పైపులైన్లను కూడా పాడుచేసి గ్రావెల్‌ను తరలించుకుపోయారు. అయినప్పటికీ బాధ్యులపై ఇప్పటి వరకు అధికారులు చర్యలు చేపట్టలేకపోయారు. రెవెన్యూ, మైనింగ్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే అక్రమార్కులు రెచ్చిపోతున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలో రోజూ రాత్రి వేళ కొండ చుట్టూ తవ్వకాలు జరుగుతున్నాయని, యంత్రాలను మెట్టకు సమీపంలో ఉంచి లారీల ద్వారా తరలించుకుపోతున్నారని స్థానికులు చెపుతున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి బోడి మెట్ట చుట్టూ తవ్వకాలపై నిఘా పెట్టి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు.

విపత్తుల వేళ అప్రమత్తంగా ఉండాలి

▸▸ డీఆర్‌వో సత్యనారాయణరావు

▸▸ ప్రజలకు అవగాహన కల్పించేందుకు మాక్‌డ్రిల్



మాక్‌డ్రిల్‌లో భాగంగా మెట్లపైనుంచి వ్యక్తిని కిందకు దించుతున్న సిబ్బంది



తక్షణ వైద్య సేవలు అందిస్తున్న వైద్య బృందం

అనకాపల్లి టౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి): ఉగ్రదాడులు, విపత్తుల వేళ ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు సూచించారు. బుధవారం జాతీయ రహదారిలోని గ్రీన్‌హిల్స్ గేటెడ్ కమ్యూనిటీ అపార్టుమెంట్‌లోని శేషాద్రి బ్లాక్ వద్ద డీఆర్‌వో ఆధ్వర్యంలో నిర్వహించిన మాక్‌డ్రిల్ ఆసక్తికరంగా సాగింది. ఈ సందర్భంగా డీఆర్‌వో మాట్లాడుతూ జాతీయ, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన (ఎస్‌ఆర్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్) దళాలు, రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక శాఖ, ఆరోగ్యశాఖలు దళాల విన్యాసాల్లో భాగస్వాములయ్యారు. ఈ అపార్టుమెంట్‌లో 400 నుంచి 500 వరకు జనాభా ఉంటారని, ఇలాంటి అపార్టుమెంట్‌ల్లో ఎక్కువ మానవ నష్టాలు ఉండే అవకాశాలుంటాయని ఆయన తెలిపారు. బాంబు పేలి భవనం కూలిపోతే ఏం చేయాలి?, సైరన్ మోగినప్పటి నుంచి చివరి వరకు రెస్క్యూ చేసి ఆస్పత్రికి చేర్చే దాకా వివిధ రకాల డ్రిల్స్‌ను అధికారులు చూపించారు. వినూత్నమైన పరికరాల గురించి వివరించారు. విపత్తుల యాజమాన్య సంస్థ సిబ్బంది అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తారని ఆయన చెప్పారు. అన్ని శాఖల సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రజల ప్రాణాలతో పాటు ఆస్తినష్టం జరగకుండా చూడాలని సూచించారు. స్థానికులతో ఈ సందర్భంగా రెస్క్యూ చేయించామన్నారు. మాక్‌డ్రిల్ పట్ల పిల్లలు, యువకులు, మహిళలకు ఎక్కువగా అవగాహన ఉండాలన్నారు. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో సీజ్ ఫైర్ ఉన్నా సరే ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అంతకు ముందు అకస్మాత్తుగా ఏదైనా విపత్తు సంభవిస్తే, విపత్కర, సంక్షోభ పరిస్థితులు ఎదురైతే, యుద్ధం వల్ల బాంబులు పడి లేదా గ్యాస్ లీక్, షార్టు సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం చోటు చేసుకుంటే అలాంటి సమయంలో ప్రభుత్వం ఏ విధమైన సహాయ చర్యలు తీసుకుంటుంది?, వివిధ ప్రభుత్వ శాఖలు ఎటువంటి చర్యలు చేపడతాయి?, ఆయా శాఖల సిబ్బంది ప్రాణాలను తెగించి ఏ విధంగా కాపాడతారన్న అంశాలను సిబ్బంది కళ్లకు కట్టినట్టు చూపించారు. బాంబులు, ఇతర పేలుడు పదార్థాలను నిర్వీర్యం చేసే విధానాన్ని కూడా వివరించారు. రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక, వైద్యశాఖ, ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ తదితర శాఖలు ఈ విన్యాసాల్లో భాగస్వాములు అయ్యారు. పైఅంతస్తులో అగ్నిప్రమాదం జరిగినప్పుడు అగ్నిమాపక సిబ్బంది క్షతగాత్రులను అక్కడి నుంచి కిందకు దించడం, వారికి వైద్యసహాయం అందించడం, హుటాహుటిన అంబులెన్స్ ద్వారా ఆస్పత్రికి తరలించడం వంటి విషయాలను కళ్లకు కట్టినట్టు చూపించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఇన్‌చార్జి ఆర్డీవో శ్రీనివాస్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శాంతిప్రభ, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి ఆర్. వెంకటరమణ, ఎన్‌డీఆర్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ సుశాంత్‌కుమార్, అగ్నిమాపక, వివిధశాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

మరిడిమాంబ జాతర ప్రారంభం



అమ్మవారి ఘటాల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

లంకెలపాలెం, మే 14 (ఆంధ్రజ్యోతి) : లంకెలపాలెం, పరిసర ప్రాంతాల ప్రజల ఆరాధ్య దేవత మరిడిమాంబ జాతర బుధవారం ఘనంగా ప్రారంభమైంది. ఇందులో భాగంగా ఘటాల ఊరేగింపు, కోటి దీపాల వేడుకలను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి దీపాలను వెలిగించి అమ్మవారికి పూజలు జరిపారు. గురువారం అమ్మవారి అనుపోత్సవం అత్యంత వైభవోపేతంగా నిర్వహించనున్నామని కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్, స్థానిక నాయకులు ఎర్రా కోటేశ్వరరావు, సుందరపు అప్పారావు, కర్రి అప్పారావు, సర్వసిద్ధి సన్యాసిరాజు, రామారావు, యలమర్తి వెంకటరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయానికి విరాళాలు

పరవాడ, మే 14 (ఆంధ్రజ్యోతి) : ఈ.బోనంగి ఫార్మా పునరావాస కాలనీలో కొండపై గల అభయ వేంకటేశ్వరస్వామి ఆలయానికి సర్దార్ గౌతులచ్చన్న నగర్‌కు చెందిన రాజులపాటి వెంకట నారాయణ దంపతులు బుధవారం రూ.50వేల విరాళాన్ని అందజేశారు. ఆలయంలో చేపట్టనున్న తృతీయ వార్షిక బ్రహ్మోత్సవాలతో పాటు మహాలక్ష్మి, గోదాదేవి అమ్మవారి విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవం నిమిత్తం ఆలయ కమిటీ చైర్మన్ బుగిడి రామగోవిందరావుకు ఈ మొత్తాన్ని అందించారు. మరికొంత మంది భక్తులు విరాళాలను అందజేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు దేముడమ్మ, సీహెచ్‌వీ సత్యనారాయణ, మేడిశెట్టి బాలాజీ, నాయుడు, కనక సంతోషి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

విశాఖపట్నం, మే 14 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందినట్టు విశాఖపట్టణంలోని ఎంవీపీ పోలీసులు తెలిపారు. అనకాపల్లి గవరపాలెం కర్రి వారి వీధిలో ఉంటున్న కర్రి లక్ష్మణరావు (39) ఈ నెల 18న ఆటోలో ఎండాడ నుంచి నగరంలోకి వస్తుండగా, ఆటో డ్రైవర్ అబ్దుల్ మజీద్ వాహనాన్ని అతి వేగంగా నడుపుతూ వెంకోజీపాలెం వద్ద విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో లక్ష్మణరావుకు తీవ్రగాయాలపాలవడంతో ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న లక్ష్మణరావు మంగళవారం రాత్రి మృతి చెందినట్టు ఏఎస్ఐ సత్యం తెలిపారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనకాపల్లి టౌన్/కశింకోట, మే 14 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ లైన్ల విస్తరణలో భాగంగా శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు గాంధీమార్కెట్ సెక్షన్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఈపీడీసీఎల్ ఈఈ కె. రాజశేఖర్ తెలిపారు. ఈ కారణంగా బజాజ్ షోరూం, ఇనుపకొట్టు నాగేశ్వరరావు ఏరియా, శారదా కాలనీ, నెహ్రూచౌక్, ఎల్ఐసీ ఆఫీస్ ఏరియా, ఉమ్మలాడ రోడ్డు ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఇదిలావుంటే, కశింకోట సబ్ స్టేషన్ పరిధి హెచ్‌టీ, ఎల్‌టీ లైన్ల మరమ్మతుల కారణంగా కొత్తూరు కార్యాలయం పరిధిలో కొత్తూరు, మూలపేట, సత్యనారాయణపురం,పిసినికాడ గ్రామాల్లో శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు అధికారులు తెలిపారు.

ఉత్తమ విద్యార్థులకు సత్కారం



సత్కారం పొందిన విద్యార్థులతో నాయకులు

అనకాపల్లి టౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జీవీఎంసీ బాలికోన్నత పాఠశాలలో ఉత్తమ విద్యార్థులను బుధవారం సత్కరించారు. జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు పెతకంశెట్టి శివ సత్యనారాయణ జోసఫ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు లంకపల్లి యశశ్విని, లిఖిత, మలసాల శరణ్య, చొప్పా అనిల్, భవిత, శ్రీవైభవ్, పెంటకోట కావ్యలను అతిథులు సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు, మందపాటి జానకిరామరాజు, జాజుల రమేష్, వేగి త్రినాథ్, గైపూరి రాజు, ఉగ్గిన అప్పారావు, వెలగా కాశీపతి, పూసర్ల నరసింగరావుతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

త్వరలో టీడీపీ మండల కమిటీలు

▸▸ కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు

▸▸ పార్టీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ



సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ

పరవాడ, మే 14 (ఆంధ్రజ్యోతి) : గ్రామస్థాయి నుంచే టీడీపీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ పిలుపునిచ్చారు. బుధవారం ఇక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. పార్టీలో కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. మండలంలో ఇంకా బ్యాలెన్స్ ఉన్న గ్రామ కమిటీలను వేగంగా పూర్తి చేయాలన్నారు. త్వరలోనే మండల కమిటీలు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన ప్రకటించారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీలు పైలా జగన్నాథరావు, మాసవరపు అప్పలనాయుడు, అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కన్నూరు వెంకటరమణ, పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతకాయల ముత్యాలు, పార్టీ మండల అధ్యక్షుడు వియ్యపు చిన్న,నాయకులు రాయవరపు దేముడు, ఇందల కొండలరావు, బొండా సన్నిదేముడు, కేఆర్‌కే రాజు తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది సమస్యలు పరిష్కరించకుంటే విశాఖ డెయిరీ ముట్టడి

▸▸ సంస్థలో కుటుంబ పాలనకు స్వస్తి పలకాలి

▸▸ ఉద్యోగుల ఖాతా నుంచి వాడుకున్న రూ.8 కోట్లు జమ చేయాలి

▸▸ విశాఖ డెయిరీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ



వేతన కార్యదర్శులు, సిబ్బంది సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

సబ్బవరం, మే 14 (ఆంధ్రజ్యోతి) : విశాఖ డెయిరీ వేతన కార్యదర్శులు, సిబ్బంది డిమాండ్లను పరిష్కరించకుంటే ఉద్యమం తప్పదని ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పెంటకోట సత్యనారాయణ హెచ్చరించారు. మండలంలోని ఇరువాడ గ్రామంలో బుధవారం సబ్బవరం యూనిట్ పరిధిలోని వేతన కార్యదర్శులు, సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. దశాబ్దాలుగా డెయిరీకి సేవలందిస్తున్న సిబ్బంది చాలీచాలని వేతనాలతో కుటుంబాలు నెట్టుకువస్తున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికీ కనీస వేతనాలు అమలు చేయలేదని, ఉద్యోగ భద్రత కల్పించలేదని, ఈఎస్ఐ అమలు కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దివంగత ఆడారి తులసీరావు డెయిరీ చైర్మన్‌గా ఉన్న కాలంలో ఉద్యోగుల ఖాతా నుంచి రూ.ఎనిమిది కోట్లు వాడేసుకున్నారని ఆరోపించారు. తక్షణమే ఆ సొమ్మును ఉద్యోగుల ఖాతాకు జమ చేయాలని డిమాండ్ చేశారు. డెయిరీ పరిధిలోని 850 పాల కేంద్రాల్లో 17 వందల మంది ఉద్యోగులు పని చేస్తున్నారన్నారు. వీరంతా వెట్టిచాకిరీ చేస్తున్నారని వాపోయారు. డెయిరీలో కుటుంబ పాలన సాగుతుందని, అంతా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వకుండా పాల ధరలు పెంచడం సరికాదన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే విధులను బహిష్క రించి, డెయిరీని ముట్టడిస్తామని హెచ్చరించారు. సంఘం ఉపాధ్యక్షుడు జి.కనకారావు, కార్యదర్శి సూర్యారావు, సహాయ కార్యదర్శి బి.ప్రసాద్, జామి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

▸▸ రైతు సంఘాల సమన్వయ సమితి ప్రతినిధుల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న కిసాన్‌మోర్చ జిల్లా కన్వీనర్ అప్పారావు

అనకాపల్లి టౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు చట్టం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక వృత్తి సంఘాల సమన్వయ సమితి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఇక్కడి సీపీఎం కార్యాలయంలో బుధవారం జరిగిన సమితి సమావేశంలో సంయుక్త కిసాన్‌మోర్చ జిల్లా కన్వీనర్ కర్రి అప్పారావు, జిల్లా కో-కన్వీనర్ గాడి బాలు మాట్లాడుతూ రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికుల రుణాలను రద్దు చేయాలన్నారు. ఉపాధి హామీ పథకంలో కూలీలకు పనిదినాలను రెండు వందల రోజులకు పెంచి, రోజు కూలి రూ.600 చెల్లించాలని, కౌలు రైతుల రక్షణకు సమగ్ర చట్టం చేయాలని, నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని కోరారు. అలాగే, కార్మికుల కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20వేలు వెంటనే చెల్లించాలని, విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలపై ఈ నెల 20వ తేదీన చేపట్టనున్న సమ్మెను అంతా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కోరిబిల్లి శంకరరావు, ఎస్.బ్రహ్మాజీ, బి.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇదిలావుంటే, దేశవ్యాప్తంగా ఈనెల 20న జరగనున్న సమ్మెకు జీవీఎంసీ అనకాపల్లి జోన్‌లో కార్మికులు మద్దతు తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం సీఐటీయూ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు గంటా శ్రీరామ్ మాట్లాడుతూ కార్మికవర్గానికి వ్యతిరేకంగా ఉన్న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పబ్లిక్ హెల్త్, నీటి సరఫరా, యూజీడీ విభాగాల్లోని కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. 12వ పీఆర్‌సీ కమిటీ వేయాలన్నారు. సమ్మెను అంతా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గోకాడ దేముడునాయుడు, యూనియన్ ప్రతినిధులు నిమ్మకాయల అజయ్, పొట్నూరు గోవింద్, సంతోష్, స్వామి, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ

- ప్రాథమిక పాఠశాలలకు అనుబంధంగా వసతి గృహాలు
- ఏ గ్రామ విద్యార్థులకు అక్కడే హాస్టల్ సౌకర్యం
- కేంద్ర ప్రభుత్వ నూతన విద్యావిధానం అమలు
- కొన్నింటిని మోడల్ పాఠశాలలుగా మార్పు

అరకులోయ, మే 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిన నూతన విద్యావిధానం ద్వారా ప్రాథమిక పాఠశాలలో అనుబంధంగా వసతి గృహాలు ఏర్పాటుకానున్నాయి. ఏ గ్రామంలో పాఠశాలల్లో చదువుకునే చిన్నారులకు అక్కడే వసతిగృహం నిర్మించనున్నారు. 2025-26 విద్యాసంవత్సరానికి ప్రాథమిక పాఠశాలలను ఎంపిక చేశారు. ఈ విధానంతో నిరుపేద కుటుంబాల పిల్లలందరికీ చదువు, మూడు పూటల భోజనంతోపాటు వసతి ఒక్కచోటే అందుబాటులోకి వస్తుంది. అయితే, ఈ విధంగా ఎంపిక చేసిన గ్రామంలోని పాఠశాలకు ఎకరా భూమి కేటాయించాల్సి ఉంటుంది. ఇలా కేటాయించినట్లయితే, వసతిగృహం భవనాలతో పాటు మౌలిక వసతులకు కేంద్ర ప్రభుత్వం రూ.కోటి చొప్పన మంజూరు చేయనుంది. అరకులోయ మండలంలో 7 ప్రాథమిక పాఠశాలలకు అనుబంధంగా వసతిగృహాలు మంజూరైనట్టు ఎంఈవో వంతల త్రినాధరావు తెలిపారు.

వసతి గృహాలకు ఎంపికైన పాఠశాలలివి..

రణజిల్లడ, యండపల్లివలస, చొంపి, నందివలస, చినలబుడు, మాడగడ, వంతమూరు, సుంకరమెట్టలలోని ప్రాథమిక పాఠశాలలకు అనుభందంగా వసతి గృహాలు అందుబాటులోకి రానున్నట్టు ఎంఈవో తెలిపారు. ఎంపికైన పాఠశాలలున్న గ్రామాలలో ఎకరా స్థలం కేటాయించాలని తహసీల్దార్‌కు ఉత్తర్వులు వచ్చాయన్నారు.ఈ మేరకు స్థల కేటాయింపుపై చర్యలు చేపడుతున్నారు.

నందివలస అప్పర్ ప్రైమరీ పాఠశాల హైస్కూల్‌గా అప్‌గ్రేడ్

మాదల పంచాయతీ పరిధి నందివలస అప్పర్‌ప్రైమరీ పాఠశాలను అప్‌గ్రేడ్‌చేస్తూ హైస్కూల్‌గా మారుస్తున్నట్టు ఎంఈవో తెలిపారు. ఇప్పటి



హైస్కూల్‌గా అప్‌గ్రేడైన నందివలస యూపీ పాఠశాల

వరకు 7 వతరగతి వరకు మాత్రమే ఉందని రానున్న విద్యా సంవత్సరం నుంచి తరగతుల అప్‌గ్రేడ్ అమలులోకి వస్తుందన్నారు. కొద్దిరోజులుగా పంచాయతీ పరిసర గ్రామాల ప్రజలు మాదలలో హైస్కూల్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఎట్టకేలకు వారి ఆశలు కార్యరూపం దాల్చాయి.

15 మోడల్ ప్రైమరీ పాఠశాలలు

మండలంలో 60 మంది పిల్లలు కన్నా ఉన్న ప్రాథమిక పాఠశాలను ప్రభుత్వం ప్రత్యేకంగా గుర్తించి మోడల్ ప్రైమరీ పాఠశాలలగా తీర్చిదిద్దుతుంది. ఈ మోడల్ పాఠశాలలో కచ్చితంగా 1 నుంచి 5 తరగతులకు ఐదుగురు ఉపాధ్యాయులు ఉండేలా విదాశాఖ చర్యలు తీసుకుంటుంది. ఇప్పటివరకు ఇద్దరు లేక ముగ్గరు ఉపాధ్యాయులు విధుల్లో ఉండేవారు. మోడల్ స్కూల్‌గా ఎంపికైనందున కచ్చితంగా పూర్తిస్థాయి ఉపాధ్యాయులుంటారు. మండలంలో గుగ్గుడు, బస్కీ, దేవరాపల్లి, రేగ, చినలబుడు, చొంపి, డప్పుగుడ, గన్నెల, కొత్తభల్లుగుడ, పెదవలస, యండపల్లివలస, మాడగడ, రణజిల్లడ, నందివలస, అరకులోయ ప్రాథమిక పాఠశాలలు మోడల్ స్కూల్‌గా గుర్తింపు పొందినట్టు ఎంఈవో త్రినాధ్ తెలిపారు. ఈ పాఠశాలల్లో చదివే బాల, బాలికలకు అన్ని తరగతులకు ఉపాధ్యాయులు అందుబాటులో ఉండడంతో మెరుగైన బోధన అందుతున్నారు.

గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్య



ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన వసతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. దీనివల్ల గిరిజన చిన్నారులకు పూర్తి స్థాయి విద్య అందుతుంది. ఈ పథకాలు క్షేత్రస్థాయిలో అమలు విషయంలో పక్కాగా చర్యలు తీసుకుంటున్నాం.

-వంతల త్రినాధరావు, ఎంఈవో, అరకులోయ మండలం

పాఠశాల అప్‌గ్రేడ్‌తో ఎంతో మేలు



నందిగుడ అప్పర్‌ప్రైమరీ పాఠశాలను ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయడంతో విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుతుంది. ఆరేళ్లక్రితమే తొమ్మిది, పదో తరగతులు అప్‌గ్రేడ్ చేయాలి. విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యం వహించారు. ఎట్టకేలకు 2025-26 విద్యాసంవత్సరం నుంచి నందిగుడ హైస్కూల్‌గా తీర్చిదిద్దడంతో పరిసర గ్రామాల విద్యార్థులకు విద్యావకాశాలు మెరుగుపడతాయి.

- సన్యాసి, మాజీ సర్పంచ్, మాదల

దోమల నివారణ మందు పిచికారీ


అనంతగిరిలో మందు స్ప్రే చేస్తున్న సిబ్బంది

అనంతగిరి, మే 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బుధవారం మలేరి యా నియంత్రణలో భాగంగా.. దోమల మందు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా మలేరియా సబ్ యూనిట్ అధికారి బాబూరావు మాట్లాడుతూ.. మండలంలోని మొదటి విడతలో 242 గ్రామాల్లో ఈ మందు స్ప్రే చేస్తున్నట్టు చెప్పారు. ఇప్పటికే అనంతగిరి, భీసుపురం, లక్ష్మీపురం, ఎం.జామిగుడ, తాటిగుడ, కమలపురం తదితర గ్రామాలను కలుపుకుంటూ 125 గ్రామాల్లో ఈ పనులు పూర్తి చేసినట్టు చెప్పారు. ఈ మందుపై అపోహాలు వద్దని, ఇళ్ల లోపల చల్లించుకోవడం ద్వారా దోమల నియంత్రించవచ్చునని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలోని మలేరియా టెక్నికల్ సూపర్‌వైజర్ రామచందర్, ఆశా కార్యకర్త సుందరొ, కమిడి లక్ష్మి,పాల్గొన్నారు.

బాలరేవుల, పోతవరంలో తాగునీటి పథకాలు ప్రారంభం


తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ ముత్యాలమ్మ

కొయ్యూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): బూదరాళ్ల పంచాయతీ బాలరేవుల, పోతవరం గ్రామాలకు నీరు- ఆరోగ్య పథకంలో భాగంగా రూరల్ డ్రింకింగ్ వాటర్ ప్రోగ్రాంలో నవనిర్మాణ సమితి, బెంగళూరుకు చెందిన ఇన్ఫో ఫౌండేషన్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన తాగునీటి పథకాలను బుధవారం సర్పంచ్ సాగిన ముత్యాలమ్మ ప్రారంభించారు. సుమారు రూ 11 లక్షల వ్యయంతో రెండు గ్రామాలలో భూమ్యాకర్షణ ద్వారా తాగునీరందించేలా పథకాలు నిర్మించారు. దీంతో 436 మంది జనాభా కలిగిన బాలరేవుల, సుమారు 100 మంది జనాభా ఉన్న పోతవరం గ్రామాలకు తాగునీటి సమస్య పరిష్కారమైంది. ఈ కార్యక్రమంలో సంస్థ కో ఆర్డినేటర్ నాగేశ్వరావు, పంచాయతీ కార్యదర్శి లీల కృష్ణ, ఎంపీటీసీ నారాయణ, పంచాయతీ సభ్యులు సంజీవ్, తేజ, భారతి, పద్మ, ఆయా గ్రామాల పెద్దలు మహిళలు పాల్గొన్నారు.

ఉత్సవాలు విజయవంతం చేసిన అందరికీ అభినందనలు: ఇన్‌చార్జి కలెక్టర్


ఇన్‌చార్జి కలెక్టర్ అభిషేక్

పాడేరు, మే 14(ఆంధ్రజ్యోతి): పాడేరు మోదకొండమ్మ ఉత్సవాలు విజయవంతానికి కృషి చేసిన అందరికీ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్, జేసీ డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ అభినందనలు తెలిపారు. ఈమేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉత్స వాలు మూడు రోజులు భక్తులకు మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు అమ్మవారి దర్శనం, ఇతర సౌకర్యాలు అధికారులు చక్కగా కల్పించారన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారని, అధికారులు, ఉత్సవ కమిటీ సమన్వయంతో ఉత్సవాలను విజయవంతం చేశారని పేర్కొన్నారు. ప్రత్యేకంగా, పరోక్షంగా ఉత్సవాలను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ఆయన అభినందనలు తెలిపారు.

ఈఎంఆర్ విద్యాలయాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గూడెంకొత్తవీధి మే 14 ఆంధ్రజ్యోతి: పాడేరు ఐటీడీఏ పరిధిలోనున్న ఏకలవ్య ఆదర్శ నివాసానుబంధ విద్యాలయాల్లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఈనెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని స్థానిక ప్రిన్సిపాల్ ఎంవీ రమణ తెలిపారు. జీకేవీధి, చింతపల్లి, ముంచంగిపుట్టు, డుంబ్రిగుడ విద్యాలయాల్లో స్థానిక పాఠశాల విద్యార్థులకు.. ఇంకా మిగులు సీట్లు ఇతర విద్యార్థులకు కేటాయిస్తామన్నారు. పది ఉత్తీర్ణులైన విద్యార్థులు నెలాఖరులోగా సంబంధిత విద్యాలయాల్లోగాని, పాడేరు గురుకులం కార్యాలయంలోగాని దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహనకు కళాజాత ప్రదర్శన


కించుమండలో సంతలో అవగాహన కల్పిస్తున్న కళాకారులు

డుంబ్రిగుడ, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కించుమండ బుధవారం జరిగిన వారపు సంతలో ఎయిడ్స్, హెచ్‌ఐవీ నియంత్రణ సంస్థ, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కళాజాత ప్రదర్శనను చేపట్టారు. మన్యంసీమ కళాజాత బృందం సభ్యులు అప్పలరాజు, రామారావు, అచ్చిబాబు, మూర్తీ, రాజీ, ఈశ్వరరావు నాట్యం, పాటల రూపంలో ఎయిడ్స్‌పై గిరిజనులకు అవగహన కల్పించారు. ఎయిడ్స్ రోగుల పట్ల సమాజంలో వివక్ష చూపకుండా ప్రేమాభిమానాలందించాలన్నారు. ఈకార్యక్రమంలో ఎన్‌జీవో బృందం తదితరులు పాల్గొన్నారు.

మోదకొండమ్మ ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రజా ప్రతినిధులు, ఉత్సవ కమిటీ సభ్యులు

పెదబయలు, మే 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఈ నెల 18,19,20 తేదీల్లో నిర్వహించనున్న మోదకొండమ్మ తల్లి ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక అమ్మవారి ఆలయం వద్ద ఉత్సవాలకు సంబంధించిన సాంస్కృతిక కార్యక్రమాల పోస్టర్లను ఎంపీపీ వరహాలమ్మ, నాయకులు సూరయ్య, మాధవరావు, సన్నిబాబు చేతులమీదగా ఆవిష్కరించారు. ఉత్సవ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు బొంజుబాబు, చక్రధర్, సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అల్లూరి ఉత్సవాలకు రంపచోడవరం ఎమ్మెల్యే వితరణ


నగదును మంప గ్రామస్థులకు అందచేస్తున్న టీడీపీ నేత దొరబాబు

కొయ్యూరు, మే 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని మంప గ్రామంలో నిర్వహిస్తున్న మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి ముగింపు ఉత్సవాలకు రంప చోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష, విజయ భాస్కర్ దంపతులు రూ.లక్ష విరాళం అందించారు. ఈ మేరకు ఉత్సవ కమిటీకు మండల తెలుగుదేశం పార్టీ మండల కార్యదర్శి దొరబాబు, తెలుగు యువత కార్యదర్శి బూదరాళ్ళ పండు చేతుల మీదుగా బుధవారం నగదును అందచేశారు. ఈ సందర్భంగా అల్లూరి ఉత్సవాల నిర్వహణకు సహకరించి ఎమ్మెల్యే దంపతులకు గ్రామ పెద్దలు వడపల రామారావు, అప్పలకొండ, యూత్ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే చిట్టినాయుడు సతీమణి మృతి


కొట్టగుల్లి గంగాభవాని (ఫైల్)

పాడేరు, మే 14(ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ఎమ్మెల్యే కొట్టగుల్లి చిట్టినాయుడు సతీమణి గంగాభవాని (75) మృతి చెందారు. గతకొన్నాళుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె బుధవారం ఉదయం తదిశ్వాస విడిచారు. గంగా భవాని మృతి చెందిన విషయం తెలుసుకున్న ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతలు, కుటుంబీకులు, బంధువులు ఆమె భౌతిక కాయం చూసేందుకు అధిక సంఖ్యలో వచ్చారు. అలాగే జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్, అరకులోయ ఎంపీ తనూజారాణి, అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, టీడీపీ నేత పాండురంగస్వామి తదితరులు గంగాభవాని పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే, గంగాభవాని కుమార్తె, మాజీ ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, సోదరుడైన టీడీపీ నేత బాకూరు వెంకటరమణరాజు, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.


గంగాభవాని పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న జీసీసీ చైర్మన్ శ్రావణ్‌కుమార్

అంగన్‌వాడీల నియామకాల్లో ఫిర్యాదుపై విచారణ


పకాబులో విచారణ చేపడుతున్న జీకేవీధి సీడీపీవో లక్ష్మీదేవి

చింతపల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పిసిరిమామిడి, పకాబు అంగన్‌వాడీ ఆయా, మినీ కార్యకర్త నియామకాల్లో అక్రమాలు జరిగినట్టు వచ్చిన ఫిర్యాదులపై విచారణ చేపట్టినట్టు జీకేవీధి సీడీపీవో లక్ష్మీదేవి అన్నారు. పిసిరిమామిడి గ్రామానికి చెందిన అప్పలమ్మ, పకాబు గ్రామానికి చెందిన బోనంగి భవాని, వెంకటలక్ష్మి, శిరీషలు తమ గ్రామాల్లో ఆయా, మినీ కార్యకర్త ఉద్యోగాలు అనర్హులకు కేటాయించారని, అర్హులైన తమను ఎంపిక చేయలేదని కలెక్టర్‌కి మీకోసంలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ విచారణ అధికారిగా జీకేవీధి సీడీపీవో లక్ష్మీదేవిని నియమించారు. బుధవారం జీకేవీధి సీడీపీవో, స్థానిక సీడీపీవో జీవీ రమణతో కలిసి పకాబు, పిసిరిమామిడి గ్రామాన్ని సందర్శించి బాధితులు, గ్రామస్తులను విచారించారు. నివేదికను జిల్లా కలెక్టర్‌కి అందజేస్తామని సీడీపీవో తెలిపారు. ఈకార్యక్రమంలో ఏసీడీపీవో రామలక్ష్మి, సూపర్‌వైజర్లు గౌహర్ ఉన్నీష, గౌరి, అప్పలనర్స పాల్గొన్నారు.

గిరిజనుల పక్షపాతి సీఎం చంద్రబాబునాయుడు

- విజయనగరం జోన్ ఆర్టీసీ చైర్మన్ దొన్నుదొర

అరకులోయ, మే 14 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గిరిజనుల పక్షపాతి అని విజయనగరం జోన్ ఆర్టీసీ చైర్మన్, టీడీపీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఏజెన్సీలో శత శాతం గిరిజనులకే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, జీవో 3కు ప్రత్యామ్నాయ జీవో అమలుకు కృషి చేస్తున్నట్టు ప్రకటించడంపై గిరిజనులంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ మేరకు టీడీపీ పార్టీ నేతలు, ఆ మండల పార్టీ అ ధ్యక్షుడు శెట్టి బాబూరావు, పెదలబుడు సర్పంచ్ పెట్టెలిదాసుబాబుల ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం స్థానిక నాలుగురోడ్ల కూడలిలో చంద్రబాబునాయుడు ఫ్లెక్సీకి పాలాభిషేకం చేపట్టి హర్షం వ్యక్తంచేశారు. సందర్భంగా దొన్నుదొర మాట్లాడుతూ గతంలో తెలుగుదేశం ప్రభుత్వమే జీవో 3 అమల్లో తీసుకువచ్చి శత శాతం గిరిజనులకు ఉద్యోగ అవకాశాలు కల్పించినట్టు గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జీవోను సుప్రీంకోర్టు రద్దు చేస్తే అప్పటి పాలకులు కనీసం రివ్యూపిటిషన్ వేసి పునరుద్దరణ చర్యకు కనీసం చర్య లు చేపట్టలేదని అసంతృప్తి వ్యక్తంచేశారు. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఈ జీవో ప్రత్యామ్నాయ జీవోను అమలు చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. మంగళవారం గిరిజన సంక్షేమ మంత్రిత్వశాఖ సమీక్షా సమావేశం లో స్వయంగా ముఖ్యమం త్రి చంద్రబాబునాయుడు దీనిపై కీలక ప్రకటన చేశారన్నారు. గిరిజనుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఈమేరకు పనిచేస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ అమ్మన్న, పద్మాపురం మాజీ సర్పంచ్‌లు, సీనియర్ నాయకులు మహాదేవ్, వనాది, చందు, మహిళా నాయకులు బూర్జలక్ష్మి. బొరిబొరి లక్ష్మి , నీరజ, తులావతి, గౌరి, మాణక్యం, దొన్ను, పాంగి మిన్ను, పదానందం, వార్డు మెంబర్లు త్రినాధరావు, గంగ, నాగరాజు, జగదీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ప్రాంతంలో జనసేన బలోపేతం

- పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి గంగులయ్య


జనసేనలో చేరిన వైసీపీ కార్యకర్తకు కండువాకప్పి స్వాగతిస్తున్న గంగుయ్య

చింతపల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో జనసేన బలోపేతమవుతున్నదని పాడేరు నియోజక వర్గం ఇన్‌చార్జి వంపూరు గంగులయ్య అన్నారు. బుధవారం మండలంలోని లోతుగెడ్డ జంక్షన్‌లో కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు కూడా రామకృష్ణతోపాటూ వంద మంది కార్యకర్తలు, పార్టీ అభిమానులు జనసేనలో చేరారు. వీరికి గంగులయ్య పార్టీ కండువాలతో స్వాగతం పలికారు. ఈసందర్భంగా గంగులయ్య మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కి గిరిజన ప్రాంతం, ఆదివాసీలన్నా అమితమైన అభిమానమన్నారు. ఆదివాసీలకు ప్రభుత్వ పథకాలు అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారన్నారు. అధిక మొత్తంలో నిధులు కేటాయిస్తున్నారన్నారు. దీంతో ఆదివాసీలు జనసేనకు ఆకర్షితులవుతున్నారన్నారు. ఇతర పార్టీల నుంచి అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, నాయకులు జనసేనలో చేరుతున్నారన్నారు. రానున్న రోజుల్లో జరగనున్న ఎన్నికల్లో తమ పార్టీ సత్తాచాటుతుందన్నారు. ఈకార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి ఉల్లి సీతారామ్, సీనియర్ నాయకులు ఉగ్రంగి లక్ష్మణరావు, జి.మాడుగుల మండలాధ్యక్షుడు భీమన్న, నాయకులు అశోక్, చిన్నిరాజబాబు, శ్రీను, నాగేశ్, శ్రీను, అబ్బాయి పాల్గొన్నారు.

నవ ధాన్యాల సాగుతో ప్రయోజనాలు



రోలంగిపుట్టులో ర్యాలీ చేపడుతున్న సంస్థ సభ్యులు

జి.మాడుగుల, మే 14 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయంలో భాగంగా నవ ధాన్యాలు సాగు మంచి ఫలితాలు ఇస్తాయని పీఎండీ ఎం. నిట్టాపుట్టు యూనిట్ సభ్యులు సూచించారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో సింగర్భ పంచాయతీ రోలంగిపుట్టులో రైతులకు అవగాహన కల్పించారు. వాటి సాగు నివాణ చర్యలపై ప్రతి ఒక్కరు అవగాహన పెంపొందించుకోవాలని వివరించారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో సంస్థ వివోఏ, ఏపీసీఎస్ఎఫ్, సీఆర్‌పీలు, రైతులు పాల్గొన్నారు.

బాలిక ఆశ్రమ పాఠశాలగా బాలుర-2 మార్పు



చింతపల్లిలో బాలికల పాఠశాలగా మార్పుచెందనున్న బాలుర ఆశ్రమ పాఠశాల-2

చింతపల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోనున్న బాలుర ఆశ్రమ పాఠశాల-2ని బాలికల పాఠశాలగా మార్పుచేస్తూ గిరిజన సంక్షేమశాఖ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఈవిద్యాసంవత్సరం నుంచి ఈ పాఠశాలలో బాలికలకు మాత్రమే ప్రవేశాలు కల్పించనున్నారు. మండలంలో లంబసింగి, వంగసార, చింతపల్లిలో మూడు గిరిజన సంక్షేమశాఖ బాలికల ఆశ్రమ పాఠశాలలున్నాయి. బాలురకు పెదబరడ, లంబసింగి, జాజులపాలెం, లోతుగెడ్డ, బలపం, చింతపల్లిలో ఏడు ఆశ్రమ పాఠశాలలున్నాయి. బాలికలకు కేవలం మూడు ఆశ్రమ పాఠశాలలు మాత్రమే ఉండడంతో పూర్తి స్థాయిలో సీట్లు లభించడంలేదు. బాలికల ఆశ్రమ పాఠశాలల్లో పరిమితికి మించి విద్యార్థినులను చేర్చుకున్నప్పటికి సీట్లు సరిపడడం లేదు. ఇతర మండలాల్లో స్థానిక విద్యార్థినులకు సీట్లు కేటాయించి మిగిలిన సీట్లు చింతపల్లి మండలానికి చెందిన బాలికలకు కేటాయిస్తున్నారు. మండలానికి చెందిన విద్యార్థినులు పొరుగు మండలాల పాఠశాలల్లో చేరాల్సి వస్తోంది. ఈసమస్యను గుర్తించిన గిరిజన సంక్షేమశాఖ అధికారులు చింతపల్లికి మరో బాలికల ఆశ్రమ పాఠశాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇప్పటికిప్పుడు నూతన పాఠశాల ఏర్పాటు చేయడం సాధ్యంకానందున స్థానిక గిరిజన సంక్షేమశాఖ బాలుర ఆశ్రమ పాఠశాల-2ని బాలికల పాఠశాలగా మార్పు చేశారు. ప్రస్తుతం పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులకు ఇతర బాలుర పాఠశాలల్లో సర్దుబాటు చేస్తారు. జూన్ 15 నుంచి బాలూర-2 పాఠశాలలో బాలికలకు ప్రవేశాలు కల్పించనున్నారు.

పుడమి తల్లికి.. పచ్చని హారం


వి.కోడాపల్లిలో పొట్ట దశలో వరి చేను

జి.మాడుగుల, మే 14 (ఆంధ్రజ్యోతి): కోనసీమను తలపించేలా మండలంలో పచ్చని పైరు కనువిందు చేస్తోంది. మన్యంలో ఇటీవల అధికంగా వర్షాలు కురువడంతో రబీసాగు ఆశాజనకంగా ఉంది. ఊట, పారుగెడ్డ నీరుపై ఆధారపడి పండిస్తున్న రబీ వరి సాగుకు అదినుంచి వర్షాలు మరింత అనుకూలిస్తున్నాయి. ప్రస్తుతం వి. కోడాపల్లిలో పొట్ట దశకు చేరడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండువేసవిలో పచ్చదనంతో కూడిన పొలాలు ఆకట్టుకుంటున్నాయి.

షెడ్యూల్ ఏరియా ఉద్యోగ నియామకాల చట్ట సాధనకు రిలే దీక్షలు


ఐటీడీఏ వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో ఆదివాసీ జేఏసీ నాయకులు

పాడేరురూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ ఏరియా ఉద్యోగ నియామకాల చట్ట సాధన కోసం ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపుమేరకు రిలే నిరాహార దీక్షలను బుధవారం ఐటీడీఏ కార్యాలయం ఎదుట ప్రారంభించారు. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా చైర్మన్ రామారావు దొర, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ముఖి శేషాద్రి మాట్లాడుతూ గిరిజన హక్కులు, సమస్యలు సాధనకు ఈ రిలే నిరాహార దీక్షలను చేపడుతున్నట్టు చెప్పారు. ఆదివాసీలకు న్యాయం చేసేందుకు కూటమి ప్రభుత్వం గిరిజన సలహామండలిని వెంటనే ఏర్పాటు చేసి, షెడ్యూల్ ప్రాంతంలో ఉద్యోగ నియామకాల చట్టం చేయాలన్నారు. 2025 మెగా డీఎస్సీలో ప్రకటించిన ఏజెన్సీ పోస్టులను ఆ నోటిఫికేషన్ నుంచి మినహాయించాలని, షెడ్యూల్ ప్రాంతానికి ప్రత్యేక డీ ఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు ఏజెన్సీ ప్రాంత ఉద్యోగాలు స్థానిక గిరిజన నిరుద్యోగ యువతతోనే భర్తీ చేసేందుకు కృషి చేస్తున్నట్టు ప్రకటించడంపై జేఏసీ తరపున ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. అలాగే, తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారమయ్యేంత వరకు శాంతియుతంగా ఆందోళన కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధా న కార్యదర్శి బోయపల్లి సింహాచలం, జేఏసీ అడ్వైజర్ మినుముల ప్రసాద్, జీఎస్‌యూ రాష్ట్ర సమన్వయ కర్త కిరసాని కిశోర్, గిరిజన ఉద్యోగులు, జేఏసీ కో-కన్వీనర్‌లు తామర సురేష్, నాగరాజు, సోంబాబు, ఆదివాసీ హక్కుల ఉద్యమ నేత పూజారి సురేష్, శంకర్, అనీల్ పాల్గొన్నారు.

17న ఉచిత నేత్ర వైద్య శిబిరం

పెదబయలు, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతగుంట బాలుర-1 పాఠశాలలో ఈ నెల 17వ తేదీన ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు గాయకుడు డాక్టర్ దుడ్డు సత్యనారాయణ తెలిపారు. విశాఖ శంకర్ ఫౌండేషన్ వైద్యులు పాల్గొని రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. నేత్ర సమస్యలతో బాధపడుతున్నవారు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మఠం సూర్యనారాయణ పడాల్ పాల్గొన్నారు.

'సిబ్బంది సమస్యలు పరిష్కరించకుంటే విశాఖ డెయిరీ ముట్టడి'


వేతన కార్యదర్శులు, సిబ్బంది సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

సబ్బవరం, మే 14 (ఆంధ్రజ్యోతి) : విశాఖ డెయిరీ వేతన కార్యదర్శులు, సిబ్బంది డిమాండ్లను పరిష్కరించకుంటే ఉద్యమం తప్పదని ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పెంటకోట సత్యనారాయణ హెచ్చరించారు. మండలంలోని ఇరువాడ గ్రామంలో బుధవారం సబ్బవరం యూనిట్ పరిధిలోని వేతన కార్యదర్శులు, సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. దశాబ్దాలుగా డెయిరీకి సేవలందిస్తున్న సిబ్బంది చాలీచాలని వేతనాలతో కుటుంబాలు నెట్టుకువస్తున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికీ కనీస వేతనాలు అమలు చేయలేదని, ఉద్యోగ భద్రత కల్పించలేదని, ఈఎస్ఐ అమలు కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దివంగత ఆడారి తులసీరావు డెయిరీ చైర్మన్‌గా ఉన్న కాలంలో ఉద్యోగుల ఖాతా నుంచి రూ.ఎనిమిది కోట్లు వాడేసుకున్నారని ఆరోపించారు. తక్షణమే ఆ సొమ్మును ఉద్యోగుల ఖాతాకు జమ చేయాలని డిమాండ్ చేశారు. డెయిరీపరిధిలోని 850 పాల కేంద్రాల్లో 17 వందల మంది ఉద్యోగులు పని చేస్తున్నారన్నారు. వీరంతా వెట్టిచాకిరీ చేస్తున్నారని వాపోయారు. డెయిరీలో కుటుంబ పాలన సాగుతుందని, అంతా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వకుండా పాల ధరలు పెంచడం సరికాదన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే విధులను బహిష్క రించి, డెయిరీని ముట్టడిస్తామని హెచ్చరించారు. సంఘం ఉపాధ్యక్షుడు జి.కనకారావు, కార్యదర్శి సూర్యారావు, సహాయ కార్యదర్శి బి.ప్రసాద్, జామి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారుడికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

నర్సీపట్నం, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమలాపురం గ్రామానికి చెందిన శెట్టి స్వామినాయుడుకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును స్పీకర్ అయ్యన్నపాత్రుడు అందజేశారు. వైద్య ఖర్చుల నిమిత్తం స్వామినాయుడుకు రూ.56,043 ప్రభుత్వం మంజూరు చేసింది. తన క్యాంప్ కార్యాలయంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు బుధవారం మంజూరు పత్రాన్ని లబ్ధిదారుడికి అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు లాలం శ్రీరంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

రాయితీ పరికరాలను వినియోగించుకోండి

▸▸ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి


పవర్ టిల్లర్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

దేవరాపల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న వ్యవసాయ పరికరాలను వినియోగించుకోవాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సూచించారు. మండలంలోని పలు గ్రామాల రైతులకు రాయితీపై మంజూరైన 14 పవర్ టిల్లర్లు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పవర్ టిల్లర్ల ద్వారా రైతులకు రూ.14 లక్షల రాయితీ లభించిందని చెప్పారు. అలాగే రోటా వేటర్, నాగలిసెట్, దమ్ముసెట్లును అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెంటమ్మ టీడీపీ పరిశీలకుడు ఏసుదాసు, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, పార్టీ మండల అధ్యక్షుడు సూర్యనారాయణ, జనసేన నేత రామ్మూర్తినాయుడు వ్యవసాయ అధికారి కాంతమ్మ, విస్తరణ అధికారి కిరణ్‌కుమార్, పాల్గొన్నారు.

డీలర్లకు నియామక పత్రాలు

దేవరాపల్లి: మండలంలో నాలుగు పంచాయతీల్లో ఖాళీగా ఉన్న డీలర్ల పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి బుధవారం నియామక పత్రాలను అందించారు. దేవరాపల్లి, కాశీపురం, నాగయ్యపేట, కలిగొట్ల గ్రామాల్లో ఎంపికైన వారికి వీటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పి.లక్ష్మీదేవీ, సీఎస్‌డీటీ జి.సాయి పాల్గొన్నారు.

రేషన్ కార్డు దరఖాస్తులకు పడిగాపులు

▸▸ చీడిగుమ్మలలో ప్రజలకు తప్పని ఇక్కట్లు


చీడిగుమ్మల సచివాలయంలో పడిగాపులు కాస్తున్న ప్రజలు

గొలుగొండ, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీడిగుమ్మల గ్రామ సచివాలయంలో రేషన్ కార్డులకు దరఖస్తు చేసుకోవడానికి ప్రజలు పడిగాపులు కాస్తున్నారు. సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ సమయపాలన పాటించకపోవడంతో గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తున్నది. ఈ సచివాలయానికి బుధవారం ఉదయం పది గంటలకే ఎరకంపేట, పోలవరం, చీడిగుమ్మల తదితర గ్రామాల ప్రజలు కొత్త రేషన్ కార్డులు, సవరణల కోసం దరఖాస్తు చేసుకోవడానికి చేరుకున్నారు. అయితే డిజిటల్ అసిస్టెంట్ 11.30 గంటల వరకు రాకపోవడంతో వారంతా పడిగాపులు కాశారు. మండటెండకు గంటల తరబడి నిరీక్షించి తీవ్ర ఇబ్బందులు పడ్డామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులు సమయపాలన పాటించే విధంగా సంబంధిత అధికారులు, పాలకులు చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు.

ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలు: ఏవో


ప్రకృతి వ్యవసాయం సాగు కోసం విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏవో

మాకవరపాలెం, మే 14 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం వల్ల ఎంతో మేలు చేకూరుతుందని మండల వ్యవసాయ అధికారి చిరంజీవి చెప్పారు. మండలంలోని బూరుగుపాలెం సచివాలయంలో బుధవారం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం సాగుతో ఎరువుల వాడకం తగ్గి దిగుబడి అధికంగా వస్తుందన్నారు. ప్రతీ రైతు తమ భూమిలో ఎంతో కొంత ప్రకృతి వ్యవసాయం సాగు చేయాలన్నారు. అలాగే 30 రకాల దినుసులతో ఉన్న విత్తనాల కిట్లను రైతులకు పంపిణీ చేశారు. వీటిని పొలాల్లో వేసి కలియదున్నితే నాట్లు వేసే సమయానికి ఎరువుగా మారుతుందని ఏవో వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

వేలాడుతున్న విద్యుత్ వైర్ల తొలగింపు

▸▸ 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్


వైర్లు సరిచేస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది

నాతవరం, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మిడిగొండ గ్రామంలో చేతికి అందేంత ఎత్తులో వేలాడుతున్న విద్యుత్ వైర్లను తొలగిస్తున్నారు. 'గుమ్మిడి గొండలో ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు' అనే శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. ఈ మేరకు గ్రామంలో విద్యుత్ వైర్లు సరి చేసి రైతులకు, పాడి పశువులకు ప్రమాదం లేకుండా చూడాలని ఏఈ చంద్రమౌళి సిబ్బందిని ఆదేశించారు. ఈదురుగాలులకు ఎక్కడెక్కడ విద్యుత్ వైర్లు వేలాడుతున్నాయో తెలుసుకుని బుధవారం యుద్ధప్రతిపాదికన సరి చేస్తున్నారు. సరిచేశారు. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చలిసింగం రోడ్డు నిర్మాణం పూర్తిచేయండి

▸▸ చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు


తారు రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజు, అధికారులు

రావికమతం, మే 14 (ఆంధ్రజ్యోతి): చలిసింగం రహదారి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు సూచించారు. ఈ మేరకు బుధవారం చలిసింగం కొండెక్కి వెళ్లి గ్రామంలో రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. అలాగే మినీ వాటర్ ట్యాంకు, కుళాయిలను ప్రారంభించారు. అనంతరం ఆదివాసీలతో కలసి సహపంక్తి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల ముందు గ్రామానికి వచ్చిన సందర్భంలో ఇచ్చిన హామీ మేరకు తారు రోడ్డు నిర్మాణానికి రూ.2.5 కోట్లు మంజూరు చేయించినట్టు చెప్పారు. అటవీ శాఖ అభ్యంతరాలు లేకుండా రోడ్డు నిర్మాణానికి పర్యావరణ అనుమతులు కూడా తీసుకువచ్చామన్నారు. పెద్ద బండ రాళ్లు ఆటంకం ఉన్నప్పటికీ తొలగించి మట్టి పార్మేషన్ పనులు పూర్తయ్యాయన్నారు. త్వరలోనే తారు రోడ్డు నిర్మాణం పూర్తవుతుందని పేర్కొన్నారు. చలిసింగం గిరిజనుల వినతి మేరకు గ్రామానికి కొత్తగా వీఆర్పీని నియమిస్తున్నట్టు ఎమ్మెల్యే ప్రకటించారు. అలాగే డీఎంహెచ్‌వోతో ఫోన్‌లో మాట్లాడి గురువారం ఇక్కడ వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత కోట గోవిందరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు బంటు శ్రీనివాసరావు, బీసీ సెల్ నేత వెదురు పర్తి వెంకటాచారి పాల్గొన్నారు.

ఉపాధి పనుల కల్పనలో తేడా వస్తే సహించం

సిబ్బందికి డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ పూర్ణిమాదేవి హెచ్చరిక

చీమలపాడులో గిరిజన కూలీల సమస్యలపై ఆరా


చీమలపాడులో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న పీడీ పూర్ణిమాదేవి, అధికారులు

రావికమతం, మే 14 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పథకం పనులు కల్పించడంలో తేడా వస్తే సహించేది లేదని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ (పీడీ) పూర్ణిమాదేవి హెచ్చరించారు. మండలంలోని చీమలపాడులో ఉపాధి హామీ పథకం పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గిరిజన కూలీలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఉపాధి పనుల్లో కూలి గిట్టుబాటు కావడం లేదని, వారంలో ఆరు రోజులు పనిచేస్తే నాలుగు రోజులే మస్తర్లు వేస్తున్నారని సదరు కూలీలు సోమవారం రావికమతం మండల పరిషత్ కార్యాలయం ఎదుట పలుగు, పారలు చేతబట్టి ధర్నా నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పీడీ ఇక్కడికి వచ్చి పరిస్థితులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు కూలీలు మాట్లాడుతూ రోజంతా పనిచేస్తే రూ. 150 ఇస్తున్నారని, వారంలో ఆరు రోజులుపని చేస్తే నాలుగు రోజులే మస్తర్లు వేస్తున్నారని, ప్రభుత్వ ఆదేశాలు పాటించడం లేదని వాపోయారు. దీనిపై స్పందించిన పీడీ రోజు వారీ కూలి రూ.307 వచ్చేలా కూలీలకు మార్కింగ్ ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. పొలాలకు వెళ్లే రోడ్లు, కాలువలు, ట్రెంచ్‌ల తవ్వకాలు, పండ్ల తోటల పెంపకం వంటి పనులను గిరిజనులకు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవిందరావు కోరారు. పనులకు రానివారికి వీఆర్పీ పనికి వస్తున్నట్టుగా మస్తర్లు వేసి అవకతవకలకు పాల్పడుతున్నట్టు స్థానికులు పీడీకి ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపి తగిన చర్య తీసుకోంటామని ఆమె స్పష్టం చేశారు. ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు తవ్వించాలని వెలుగు సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకన్నబాబు, ఏపీవో చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

గోవాడ షుగర్ ఫ్యాక్టరీ పరిరక్షణకు పోరాడతాం

▸▸ అన్ని పక్షాల నాయకులతో జేఏసీ ఏర్పాటు

▸▸ కార్మిక సంఘం నాయకుడు భాస్కరరావు


కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న సంఘం నాయకుడు భాస్కరరావు

చోడవరం, మే 14 (ఆంధ్రజ్యోతి): గోవాడ షుగర్ ఫ్యాక్టరీ పరిరక్షణ కోసం అన్ని రాజకీయ పక్షాల సహకారంతో పోరాడతామని ఫ్యాక్టరీ కార్మిక సంఘం నాయకుడు కేవీవీఎస్ భాస్కరరావు ప్రకటించారు. ఫ్యాక్టరీ ఆవరణలో కార్మికులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫ్యాక్టరీ మూతపడితే అనేక మంది కార్మికుల జీవితాలు వీధిన పడే ప్రమాదం ఉందని, ఇదే సమయంలో ఫ్యాక్టరీని నమ్ముకుని చెరకు పండించే రైతులు కూడా ఇబ్బందుల పాలవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. వారి మనుగడ కోసం ఫ్యాక్టరీని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వచ్చే క్రషింగ్ సీజన్‌పై యాజమాన్యం నిర్లిప్తంగా వ్యవహరిస్తున్నదని, అందువల్ల సంఘాలకు అతీతంగా కార్మికులందరూ కలిసికట్టుగా ఫ్యాక్టరీని నడిపించే బాధ్యత తీసుకోవాలని ఆయన కోరారు. ఇందుకోసం రాజకీయాలకతీతంగా అన్ని పక్షాల నేతల సహకారంతో ఫ్యాక్టరీ పరిరక్షణ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించారు. జిల్లాలోని తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు, అనకాపల్లి ఎంపీ సహకారంతో సీఎంను కలిసి గోవాడకు సాయం కోసం అభ్యర్థిస్తామని చెప్పారు. అలాగే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌ను కూడా కలిసి ఫ్యాక్టరీని ఆదుకోవాలని కోరుతామన్నారు. ఇందుకోసం కార్మికులు అందరూ కలిసి అమరావతి వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రభుత్వపరంగా అవసరమైన సహకారం కోసం త్వరలోనే రెండు నియోజకవర్గాల్లో సంతకాల సేకరణ కార్యక్రమం ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో కార్మిక సంఘం నాయకులు బండి శ్రీను, నూకరాజు, జగన్నాధరావు, సత్యనారాయణరాజు, అల్లం రామప్పారావు, బీవీ.నూకరాజు, ఫ్యాక్టరీ సూపర్‌వైజరీ స్టాఫ్ ప్రతినిధులు శ్రీనివాసరాజు, రమణరాజు, అప్పలరాజు తదితరులు మాట్లాడారు.

ఆకట్టుకున్న 'సంఘం శరణం గచ్ఛామి'

నర్సీపట్నం, మే 14 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ సృష్టికర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్ర ఆధారంగా రూపకల్పన చేసిన 'సంఘం శరణం గచ్ఛామి' నాటకం ఆద్యాంతం ఆకట్టుకుంది. బుధవారం సిటీ క్లబ్ ఆవరణలో కుల వివక్ష పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి ఆధ్వర్యంలో అభ్యుదయ ఆర్ట్ అకాడమీ కళాకారులతో ఈ నాటకం ప్రదర్శించారు. ముందుగా ఎంఈవో తులుపులు, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోటేశ్వరరావు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నాటక ప్రదర్శన ప్రారంభించారు. సంఘం శరణం గచ్ఛామి నాటకంలో అంబేడ్కర్ పాత్రలో కె.గోపి, రమాభాయి పాత్రలో ఎం.కవిత తమ నటనతో కట్టి పడేశారు. అంబేడ్కర్ జీవిత చరిత్రను కళ్లకు కట్టినట్టు ప్రదర్శించారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలు, కర్ణాటకలో 800 ప్రదర్శనలు ఇచ్చినట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో చిట్టియ్య, విశ్రాంత అచార్యులు యలమంద, విజయ్‌కుమార్, త్రిమూర్తులురెడ్డి పాల్గొన్నారు.

భూముల కొనుగోలుపై విచారణ చేయించండి

నర్సీపట్నం, మే 14 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో జగనన్న కాలనీల కోసం సేకరించిన భూముల కొనుగోలుపై విచారణ చేయించాలని టీడీపీ కౌన్సిలర్లు ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయం డీటీ ఆశోక్‌కు వినతిపత్రం అందజేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే గణేశ్ తన అనుచరుల ద్వారా నాలుగు మండలాలలో భూములు తక్కువ ధరకు కనుగోలు చేసి ప్రభుత్వానికి అధిక ధరలకు విక్రయించారని పేర్కొన్నారు. ప్రభుత్వాన్ని, రైతులను మోసం చేసి గణేశ్ లక్షల రూపాయలు దోచుకున్నారని ఆరోపించారు. దీనిపై ప్రభుత్వం సీఐడీ విచారణ జరిపించాలని కోరారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు దనిమిరెడ్డి మధు, డబ్బీరు శ్రీకాంత్ మాట్లాడుతూ జగనన్న కాలనీల కోసం భూములు ఇచ్చిన రైతులు నేరుగా తహసీల్దార్‌లకుగాని లేదా స్పీకర్ అయ్యన్నపాత్రుడు దృష్టికి తీసుకువస్తే న్యాయం చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెదిరెడ్ల చింతూ, రుత్తల కృష్ణ పాల్గొన్నారు.

'పార్టీలో కష్టపడి వారికి పదవులు'

చీడికాడ, మే 14 (ఆంధ్రజ్యోతి): పార్టీలో కష్టపడి పనిచేసేవారికి మరిన్ని పదవులు వరిస్తాయని టీడీపీ మండల ఎన్నికల కమిటీ సభ్యులు పేరపు కొండబాబు, రెడ్డి సన్యాసినాయుడు చెప్పారు. మండలంలోని తునివలస గ్రామంలో టీడీపీ గ్రామ కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పేరపు శ్రీనివాసరావు, కార్యదర్శిగా విస్సారపు వెంకటరమణ, ఉపాధ్యక్షుడిగా సిరిసిపల్లి అప్పారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బొబ్బాది తాతారావు, సీనియర్ నేతలు గండి ముసలినాయుడు, గౌరీపట్టపు నానాజీ పాల్గొన్నారు.

సారాతో జీవితాలు పాడు చేసుకోవద్దు

కె.కోటపాడు, మే 14 (ఆంధ్రజ్యోతి): సారా తయారీ, అమ్మకం నేరమని, వాటితో జీవితాలు నాశనం చేసుకోకూడదని చోడవరం ఎక్సైజ్ శాఖ ఇన్‌స్పెక్టర్ కేవీ పాపునాయుడు సూచించారు. మండలంలోని శృంగవరం శివారు కొత్త భూమిలో సారా తయారీ, అమ్మకం చేయొద్దంటూ మంగళవారం రాత్రి గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారా కేసుల్లో చిక్కుకొని జీవితాలను పాడు చేసుకోవద్దన్నారు. నవోదయం 2.0 కార్యక్రమంలో మండలంలోని 20 కేసుల్లో 22 మంది వ్యక్తులను అరెస్టు చేశామని, 125 లీటర్ల సారా స్వాధీనం చేసుకోవడంతో పాటు 54 వేల లీటర్ల బెల్లం పులుసు ధ్వంసం చేశామన్నారు. సారా తయారీ, అమ్మకాలు జరిపే 50 మందిని గుర్తించి తహసీల్దార్ కార్యాలయంలో బైండోవర్ చేయించామన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు కె.హనుమంతు, ఎం.శేఖరం, సర్పంచ్ ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి పుష్పాంజలి


ఆలయంలో పుష్పాంజలి నిర్వహిస్తున్న దృశ్యం

చోడవరం, మే 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి కల్యాణ ఉత్సవాలలో భాగంగా బుధవారం పుష్పాంజలి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి పుష్పాంజలి వేడుకలను తిలకించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ వింజమూరి శంకర్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు దేవరపల్లి వెంకట అప్పారావు, నాయకులు సకురు కోటేశ్వరరావు, ఈర్లె శ్రీనివాస్, పప్పు శ్రీను, ఎలకా మల్లిబాబు, పార్దు రాజు, ఉపాధ్యాయుల శ్రీనివాస్, పనసారెడ్డి, చావలి నూకరాజు, అర్చకులు శేష రామగోపాలాచార్యులు, గుంటూరు శాంతారామాచార్యులు, గుంటూరు వాసు, శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.

వైభవంగా సంతానమ్మతల్లి సారె ఊరేగింపు


సంతానమ్మతల్లికి మిఠాయిలతో సారెను ఊరేగింపుగా తీసుకు వెళ్తున్న భక్తులు

నాతవరం, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్దిపట్నం గ్రామంలో కోటసంతానమ్మతల్లికి తొమ్మిది రకాల మిఠాయిలు, చీరతో సారెను వైభవంగా ఊరేగించారు. ఉదయం భక్తులు అమ్మవారికి కుంకుమతో ప్రత్యేక పూజలు నిర్వహించారు అమ్మవారిని వివిధ పుష్పాలతో ఆలంకరించారు. సంతానం లేనివారు కోట సంతానమ్మతల్లి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటే సంతానం కలుగుతుందని విశ్వాసం. కార్యక్రమంలో వేద పండితులు సత్యనారాయణమూర్తి, శ్రీనివాసశర్మ అంకంరెడ్డి రాంబాబు పాల్గొన్నారు.

చోరీ కేసులో ముగ్గురి అరెస్టు


నిందితులతో ఎస్ఐ శ్రీనివాసరావు, సిబ్బంది

బుచ్చెయ్యపేట, మే 14 (ఆంధ్రజ్యోతి): వడ్డాది సబ్ పోస్టాఫీస్‌లో చోరీకి పాల్పడిన ముగ్గుర్ని అరెస్టు చేసినట్టు ఎస్ఐ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. వడ్డాది ఎస్సీ కాలనీకి చెందిన ముగ్గురు యువకులు పోస్టాఫీస్‌లో 67,855 రూపాయల నగదును చోరీ చేసినట్టు చెప్పారు. సీసీ ఫుటేజీలను పరిశీలించి చోరీ చేసిన వారిని గుర్తించామని, వారిని పట్టుకుని నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ చెప్పారు. ఈ చోరీ కేసును ఛేదించడంలో హెడ్ కానిస్టేబుళ్లు అర్జున్, గణేశ్ వెంకట్ తదితరులు ప్రతిభ కనబరిచారని ఎస్ఐ తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్ఐ భాస్కరరావు పాల్గొన్నారు.

లేటరైట్ పేరుతో బాక్సైట్ తవ్వకాలు

మాజీ ఎమ్మెల్యే గణేశ్



నర్సీపట్నం, మే 14 (ఆంధ్రజ్యోతి): నియోజక వర్గంలోని నాతవరం మండలం బలిమిడికిలొద్ది గ్రామంలో లేటరైట్ పేరుతో బాక్సైట్ తవ్వకాలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర గణేశ్ ఆరోపించారు. బుధవారం పెదబొడ్డేపల్లి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైకోర్టు ఉత్తర్వులతో 2022లో సరుగుడులో తవ్వకాలు జరిగినప్పుడు లేటరైట్ పేరుతో బాక్సైట్ తవ్వుతున్నారని అయ్యన్నపాత్రుడు ఉద్యమం చేపట్టారన్నారు. భారతీ సిమెంట్ కోసం లేటరైట్ ముసుగులో బాక్సైట్ తవ్వకాలు జరిపి రూ.15 వేల కోట్లు ప్రభుత్వం దోపిడీ చేసినట్టు ఆరోపించారని గుర్తు చేశారు. వారే ఎన్‌జీటీలో కేసు వేసి, అది పెండింగ్‌లో ఉండగా ఇప్పుడు క్వారీలో తవ్వకాలు ఎలా జరుపుతున్నారని ప్రశ్నించారు. అప్పుడు ఎస్టీ కాదన్న జర్తా లక్ష్మణరావు పేరుతోనే ఇప్పుడు దోపిడీ చేయడం చూస్తుంటే విడ్డూరంగా ఉందన్నారు. బాక్సైట్ తవ్వకాల ద్వారా అయ్యన్నపాత్రుడు రూ.2 వేల కోట్లు దోపిడికి పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

గొలుగొండ, మే 14 (ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని గ్రంథాలయాధికారి రాజుబాబు చెప్పారు. మండల కేంద్రం గొలుగొండ గ్రంథాలయంలో బుధవారం వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు యోగా గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజుకు గంట పాటు యోగా చేయడం ఎంతో ఆరోగ్యకరమని చెప్పారు. అలాగే విద్యార్థులతో యోగా చేయించారు.

హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై కళాజాత

గొలుగొండ, మే 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని దళిత కాలనీలో హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కోసం బుధవారం కళాజాత నిర్వహించారు. అవగాహనతోనే ఎయిడ్స్ నివారణ సాధ్యమని, ఈ మహమ్మారిని తరిమికొట్టడానికి అందరూ నడుం బిగించాలని కళాకారులు పేర్కొన్నారు. హెచ్ఐవీపై అందరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

19న కోఆప్షన్ మెంబర్ ఎన్నిక

చోడవరం, మే 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కోఆప్షన్ మెంబర్ ఎన్నికను ఈ నెల 19న నిర్వహిస్తున్నట్టు ఎన్నికల అధికారి కె.రాజేశ్వరి బుధవారం తెలిపారు. కోఆప్షన్ మెంబర్ షేక్ రహిమాన్ మృతి చెందడంతో, ఎన్నిక కోసం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని చెప్పారు.

ఎంఐజీ లేఅవుట్‌పై అవగాహన

నర్సీపట్నం అర్బన్, మే 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో ఎంఐజీ లేఅవుట్‌పై బుధవారం వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ప్లానింగ్ అధికారి అరుణ మాట్లాడుతూ అల్పాదాయ వర్గాల కోసం అన్ని సౌకర్యాలతో వేసిన ఎంఐజీ లేవుట్ గురించి వివరించారు. అడ్డూరులో ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్ ఎంఐజీ లేవుట్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఉషశ్రీ, అసిస్టెంట్ ప్లానింగ్ అధికారి డి.శ్రీనివాస్, జేపీవో సునీత తదితరులు పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి

చీడికాడ, మే 14 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు వెంటనే వేతన బకాయిలు చెల్లించాలని సీఐటీయూ మండల కార్యదర్శి రొంగలి దేముడునాయుడు డిమాండ్ చేశారు. కె.కొత్తూరు, చినకోనాం గ్రామాల్లో ఉపాధి కూలీలతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆరు వారాలుగా వేతనాలు చెల్లించకపోవడంతో కూలీలు పస్తులు ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తక్షణమే స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుంబోయిన కన్నబాబు, రాజు, నాగరాజు, కొండమ్మ, భవానీ, సీతమ్మ, అధిక సంఖ్యలో కూలీలు పాల్గొన్నారు.


ఉపాధి మస్తర్లు పరిశీలించిన ఎంపీడీవో

బుచ్చెయ్యపేట, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుచ్చెయ్యపేట గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులను ఎంపీడీవో విజయలక్ష్మి బుధవారం పరిశీలించారు. అనంతరం మస్తర్లు తనిఖీచేసి కూలీలతో మాట్లాడారు. వారి రోజు వారీ వేతనాలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఉపాధి పథకం పనులు ఉదయం ఆరు నుంచి 11 గంటల్లోపు పూర్తిచేసుకోవాలని, రూ.307 కూలి వచ్చేలా పని చేయాలని సూచించారు. అనంతరం మండల కార్యాలయంలో హౌసింగ్ ఏఈ, 22 సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో సమావేశం ఏర్పాటుచేసి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

బుచ్చెయ్యపేట, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తురకలపూడి గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మంగళవారం రాత్రి ప్రారంభమైన వైద్య శిబిరం రాత్రి 12 గంటల వరకు కొనసాగింది. 150 మంది రోగులు వివిధ వ్యాధులకు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్ర మంలో స్థానిక నాయకులు గంట్ల అప్పల నాయుడు, బి.నాగభూషణం, కె.అప్పలనాయుడు, శిబిరం నిర్వహకుడు పాస్టర్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

టీడీపీ మండల అధ్యక్షుడిగా పెద్దాడ వెంకటరమణ


వెంకటరమణ

దేవరాపల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల అధ్యక్షుడిగా పెద్దాడ వెంకటరమణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే కార్యదర్శిగా దొగ్గ దేముునాయుడును ఎన్నుకున్నారు. పార్టీ పరిశీలకులు ఏసుదాసు, 27 పంచాయతీల కమిటీల ప్రతినిధులు, నాయకులతో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అధ్యక్షతన బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. బి.కింతాడ, మారేపల్లి, రైవాడ, కాశీపురం గ్రామ కమిటీ ఎన్నికలు వాయిదా వేశారు. బి.కింతాడ, కాశీపురం గ్రామస్థులు ఎమ్మెల్యే ఎదుటే తగాదా పడ్డారు. కాశీపురం గ్రామ కమిటీ ఎన్నిక పార్టీ మండల అధ్యక్షుడిగా చిటిమిరెడ్డి సూర్యనారాయణకు అప్పగించారు. మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, రైవాడ జలాశయ చైర్మన్ పాత్రు నాయుడు, చరకాన సూర్యనారాయణ, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ పాల్గొన్నారు.

వెడ్డింగ్ ఫొటోగ్రఫీలో నయా ట్రెండ్స్

మధుర జ్ఞాపకాన్ని పదిలపరుచుకునే ప్రక్రియ

- హైడెఫినిషన్ క్వాలిటీ ఉండేలా జాగ్రత్తలు
- జోరందుకున్న ప్రీ వెడ్డింగ్, పెళ్లి రోజు, పోస్టు వెడ్డింగ్ షూట్స్
- విదేశాలకు వెళ్లేందుకూ జంటల ఆసక్తి
- సినిమాలను తలపించేలా ప్రత్యేక సెట్‌లు
- ఖర్చుకు వెనుకాడని వధూవరులు





(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

ఫొటో చెదిరిపోని జ్ఞాపకం. కాలం ఎంతగా పరుగెడుతున్నా, సాంకేతికత గుప్పిట్లో ఇమిడిపోతున్నా... మధుర స్మృతులను గుర్తుచేసేది ఫొటోనే. దానిని మరింత అందంగా మలచుకుని పదికాలాల పాటు పదిలంగా దాచుకునేందుకు తహతహలాడుతుంటారు. ప్రస్తుతం సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లలో భద్రపరచుకునే డిజిటల్ ఫొటోగ్రఫీ అందుబాటులోకి వచ్చినప్పటికీ, ఆ చిత్రాన్ని బంధించేందుకు జరిగే కసరత్తు మాత్రం మారలేదు. అందునా వివాహాల సందర్భంగా తీసుకునే ఫొటోలు తరతరాలు నిలిచిపోవాలనే ఉత్సుకత ప్రస్తుత నవ దంపతుల్లో కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఖర్చుకు వెనుకాడకుండా అద్భుత చిత్రాలను బంధించేందుకు తగిన అవకాశాలను ఫొటో గ్రాఫర్లకు అందిస్తున్నారు.





కాలంతో పాటు అనేక మార్పులు వస్తుంటాయి.. ప్రస్తుతం వెడ్డింగ్ ఫొటోగ్రఫీలోనూ ఇదే కనిపిస్తోంది. కుటుంబంలో ముందు తరం పెళ్లి ఫొటోలు చూశారా.. అందులో వారు నేరుగా కెమెరా వైపు చూస్తున్న దృశ్యాలు కనిపించకపోవచ్చు. అధిక శాతం ఫొటోల్లో వారి కళ్లు కిందకి గానీ ఏదో ఒక వైపునకు గానీ చూస్తున్నట్టు ఉంటుంది. కాలం



మారడంతో వెడ్డింగ్ ఫొటోగ్రఫీ ట్రెండ్ మారింది. ఇప్పుడు కొత్త జంటలు సువిశాల ప్రాంగణంలోని ప్రత్యేక సెట్టింగ్‌ల నడుమ ఫొటోలు క్లిక్ మనిపించుకుంటున్నాయి.

గతానికి భిన్నంగా...

ఈ తరం జంటలు వైరుధ్యాన్ని కోరుకుంటున్నాయి.. సోషల్ మీడియాలో బోలెడన్ని లైక్‌లు కురిపించేలా ఫొటోలు ఉండాలని తాపత్రయపడుతున్నాయి. వెడ్డింగ్ ఫొటోలు కేవలం జ్ఞాపకాలుగా మాత్రమే కాక, పదిమందికీ షేర్ చేయడం ద్వారా తమలోని ఊహాజనిత ప్రపంచానికి ఆదరణ లభించేలా రూపొందించుకుంటున్నాయి.

అపూర్వ జ్ఞాపకాలు..

ప్రస్తుతం వధూవరులే కాకుండా వారి కుటుంబ సభ్యుల ఫొటోలను జ్ఞాపకాలుగా బంధించి, వాటిని సరైన రీతిలో అలకంరించి దాచుకోవాలని భావిస్తున్నారు. అయినప్పటికీ అత్యధిక ఫోకస్ నవ దంపతులపైనే. పెళ్లి రోజు జీవితంలో ఎంతో ముఖ్యమైనది. ఆచార, సంప్రదాయాల మధ్య ఈ మధురానుభూతిని పదిలపరిచేది ఫొటో.

సోషల్ మీడియా ప్రభావం

ప్రస్తుతం ప్రపంచం అరచేతిలో ఇమిడిపోయింది. తమ భావాలను, అద్భుత చిత్రాలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసుకునే స్వేచ్ఛ లభించింది. దీనిని వధూవరులు ప్రియమైదిగా మార్చుకుంటున్నారు. ఇందుకోసం ఉత్తమ ఫొటోలను తీయగలిగే నిపుణులైన ఫొటోగ్రాఫర్స్‌ని ఎంచుకుంటున్నారు. ఫొటోలు, వీడియోలు సృజనాత్మకంగా ఉండాలని ఆశిస్తున్నారు. లేటెస్ట్ ట్రెండ్స్ అప్‌డేట్ అవుతూ ప్రత్యేక హ్యాష్‌ట్యాగ్స్‌నీ వినియోగిస్తున్నారు. టెక్నాలజీకి తమ ఫ్యాషన్ హాబీని కలగలిపి అవుట్‌డోర్ సెలబ్రేషన్స్‌లో డ్రోన్స్‌తో ఫొటో షూట్‌లు చేసుకుంటున్నారు.

క్యాండిడ్ ఫొటోగ్రఫీ..

కొందరు క్యాండిడ్ ఫొటోగ్రఫీని సెలక్ట్ చేసుకుంటే, మరి కొందరు పోజ్డ్ ఫొటోగ్రాఫ్స్ ఇష్టపడుతున్నారు. సాధారణంగా పోజ్డ్ ఫొటోగ్రాఫ్స్ చూసేందుకు అందంగా ఉంటాయి, కానీ వివాహతంతునంతా ఇలానే బంధిస్తే మజా ఉండదు. వాటిలో ఒకే తరహా నవ్వు, హావభావాలు, స్టయిల్స్ కనిపిస్తుంటాయి. కొత్తతరం ఫొటోగ్రఫీలో అనేక స్టయిల్స్‌లో న్యాచురల్ లుక్స్ దర్శనమిస్తుంటాయి. దీనికోసం ఫొటోగ్రాఫర్స్ డిజిటల్ ఫొటోగ్రఫీని ఎంచుకుంటున్నారు. హైడె ఫినిషన్ డీఎస్ఎల్ఆర్‌లో వస్తున్న లేటెస్ట్ కెమెరాలను వినియోగిస్తున్నారు. వీటితో ఫొటోలు, వీడియోలు మంచి క్వాలిటీ రెజుల్యూషన్స్‌లో వస్తాయి.

వెడ్డింగ్ షూట్స్ ప్రత్యేకత

ఈ రోజుల్లో వెడ్డింగ్ ఫొటోగ్రఫీలోనూ మూడు దశలు కనిపిస్తున్నాయి. పెళ్లి ముందు ప్రీ వెడ్డింగ్, పెళ్లి రోజు, పోస్టువెడ్డింగ్ ఫొటోగ్రఫీ అని పిలుస్తున్నారు. పెళ్లి సంప్రదాయాలు ఎంగేజ్‌మెంట్, హల్దీ, మెహందీ వరకే పరిమితం కాకుండా ప్రత్యేకమైన ఫొటోలు తీయడం వల్ల వధూవరులు ఒకరినొకరు అర్థం చేసుకోగలుగుతారు. వెడ్డింగ్ షూట్ బెస్ట్ అనిపించుకోవాలంటే షూట్ అంతా ఒకే ఫొటోగ్రాఫర్‌తో చేయించుకోవడం ఉత్తమం. దీనివల్ల ట్యూనింగ్ సరిగా ఉంటుంది.

విభిన్న ప్రదేశాల్లో...

ప్రీ వెడ్డింగ్ షూట్ కస్టమర్ ఇష్టాన్నిబట్టి ఉంటుంది. కొందరు కొండలు, బీచ్‌లు, కోటలు, మహల్స్ ఉండేలా చూసుకుంటున్నారు. ఇందుకోసం జైపూర్, కేరళ, అరకు, దుబాయ్, గోవా, మలేషియా, థాయ్‌లాండ్ తదితర ప్రదేశాలకు వెళ్లి బడ్జెట్‌కి తగ్గట్టు రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. కొందరు తక్కువ బడ్జెట్ అవుట్‌డోర్ లొకేషన్లు ఎంచుకుంటున్నారు. కైలాసగిరి, బీచ్, యారాడ వంటి ప్రదేశాల్లో ప్రతిరోజూ ఇలా ప్రీవెడ్డింగ్ షూట్‌లు జరుగుతున్నాయి. కాగా నగరంలో ప్రత్యేక స్టూడియోలు పుట్టుకొస్తున్నాయి. సినిమా షూటింగ్‌ల తరహాలో సెట్స్ వేసి ప్రీ వెడ్డింగ్ షూట్ చేస్తున్నారు. కాస్ట్యూమ్స్‌తో పాటు అన్ని రకాల వసతులు అందిస్తున్నారు. మరికొందరు స్టోరీ రూపంలో షూట్ చేయించుకుంటున్నారు.

పోస్టువెడ్డింగ్ ఫొటోగ్రఫీ..

పోస్టు వెడ్డింగ్ షూట్‌కు కూడా ఇటీవల ఆదరణ పెరిగింది. నగరంలో ఉత్తమ లోకేషన్స్ సెలక్ట్ చేసుకుని హైటెక్నాలజీలో ఫొటో షూట్ చేయించుకుంటున్నారు. వీటిలో డ్రోన్ కెమోరాలు అధికంగా వినియోగిస్తున్నారు. అంతేకాదు పెళ్లి జరుగుతుండగానే క్లిప్స్ తీసి, వెంటనే ఎడిటింగ్ చేసి, సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసే ట్రెండ్ ప్రస్తుతం జోరుగా సాగుతోందని నగరంలోని ఫొటోగ్రాఫర్ సుమంత్ వివరించారు.

క్రైం... crime news

12 కిలోల గంజాయి స్వాధీనం

- ఇద్దరి అరెస్టు



గంజాయి నిందితులతో సీఐ కుమారస్వామి, ఎస్‌ఐ సన్నిబాబు

నక్కపల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపాడు హైవే టోల్‌ప్లాజా వద్ద 12 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్టు చేశామని నక్కపల్లి సీఐ కె.కుమారస్వామి, ఎస్‌ఐ సన్నిబాబు బుధవారం స్థానిక విలేకరులకు తెలిపారు. వేంపాడు టోల్‌ప్లాజా వద్ద ఇద్దరు వ్యక్తులు గంజాయిని రవాణా చేస్తున్నట్టు సమాచారం రావడంతో సిబ్బందితో అక్కడకు వెళ్లినట్టు ఎస్‌ఐ సన్నిబాబు తెలిపారు. తమను చూసి ఇద్దరు వ్యక్తులు రెండు బ్యాగులను పట్టుకుని వెళ్తుండగా, అనుమానం వచ్చి పట్టుకున్నామన్నారు. ఆరు ప్యాకెట్లతో వున్న 12 కిలోల గంజాయిని పట్టుకుని, కర్ణాటకకు చెందిన మునివెంకటప్ప, తమిళనాడుకు చెందిన కుప్పముత్తులను అరెస్టు చేసినట్టు చెప్పారు. మునివెంకటప్ప గతంలో ఒక హత్య కేసులో నిందితుడని, కుప్పముత్తు గంజాయి కేసులో నిందితుడని తెలిపారు. ఏజెన్సీ నుంచి బ్యాగుల్లో గంజాయిని తీసుకువస్తుండగా పట్టుకున్నామని చెప్పారు.

మోడల్ ప్రైమరీ స్కూళ్లలో ఎస్జీటీలనే హెచ్‌ఎంలుగా నియమించాలి

- యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చినబ్బాయి



మాట్లాడుతున్న గొంది చినబ్బాయి

అనకాపల్లి టౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన జీవో నంబర్ 19, 20, 21లలో పాఠశాలల పునర్నిర్మాణం పేరుతో తొమ్మిది రకాల పాఠశాలలుగా వాటిని ప్రభుత్వం విభజించిందని యూటీఎఫ్ అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శిగా గొంది చినబ్బాయి తెలిపారు. బుధవారం సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న స్కూళ్లను తొమ్మిది రకాల పాఠశాలలుగా విభజించడం వలన తల్లిదండ్రులు, విద్యార్థులు గందరగోళానికి గురయ్యే అవకాశం ఉందని, ఈ తొమ్మిది రకాల పాఠశాలలకు తెలుగు పేరు పెట్టకపోవడం శోచనీయమని వాపోయారు. ఫౌండేషన్ స్కూల్స్‌లో ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి 1:30 గాను, బేసిక్ ప్రైమరీ స్కూల్స్‌లో 1:20 గాను, హైస్కూల్స్‌లో విలీనమైన ప్రైమరీ స్కూల్స్‌లో 1:10 గాను నిర్ణయించడం సరైన పద్ధతి కాదన్నారు. ఒకటి నుంచి ఐదు తరగతులు చదువుతున్న ప్రతి పాఠశాలలోనూ ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి 1:20 గా ఉండాలని ఆయన డిమాండ్ చేశారు. మోడల్ ప్రైమరీ స్కూల్స్‌లో హెచ్‌ఎంలుగా స్కూల్ అసిస్టెంట్‌లను నియమించడం సరికాదన్నారు. మోడల్ ప్రైమరీ పాఠశాలలో ఎస్‌జీటీ టీచర్లనే హెచ్‌ఎంలుగా నియమించాలని డిమాండ్ చేశారు.

కిరండూల్ రైళ్లకు అదనపు ఏసీ చైర్‌కార్ కోచ్

విశాఖపట్నం, మే 14 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాఖ-కిరండూల్ మధ్య రాకపోకలు సాగించే రైళ్లకు అదనంగా ఒక ఏసీ చైర్‌కార్ కోచ్‌ను జత చేస్తున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. దీంతో విశాఖ-కిరండూల్ పాసింజర్ (58501) రైలుకు ఈ నెల 17, 24, 31 తేదీల్లో...కిరండూల్-విశాఖ పాసింజర్ రైలుకు (58502) ఈ నెల 18, 25, జూన్ 1న ఒక ఏసీ చైర్ కార్ కోచ్ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. అలాగే సంబల్‌పూర్-రాయగడ మధ్య రాకపోకలు సాగించే 18301, 18302 నంబరు గల రైళ్లకు ఈ నెల 16 నుంచి 31 వరకు ఒక ఏసీ చైర్‌కార్ కోచ్ జత చేశామన్నారు.

స్కిల్ హబ్‌లతో ఉపాధి బాట

... 5వ పేజీ తరువాయి

మాకవరపాలెంలో ఎస్‌ఏసీ కళాశాలలో కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్, అసిస్టెంట్ సర్వేయర్, కుట్టుమిషన్ ఆపరేటర్ కోర్సులు, చోడవరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్, మాడుగులలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్, పేషెంట్స్ రిలేషన్స్ అసోసియేట్ కోర్సుల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత జిల్లాలో ఇంత వరకు 634 మంది వృత్తి నైపుణ్యంపై శిక్షణ పొందగా వీరిలో 320 మందికి ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించాయి.

వ్యవసాయంలో యాంత్రీకరణ

... 5వ పేజీ తరువాయి

యంత్రాలు అందుబాటులోకి రావడానికి మరికొంత కాలం పడుతుందన్నారు. అనకాపల్లి, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో చెరకు సాగులో యంత్రాల వినియోగంపై ప్రత్యక్ష శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఆయన పేర్కొన్నారు. చెరకు సాగులో 75 శాతం పనులను యంత్రాల ద్వారా చేస్తే లాభసాటిగా వుంటుందన్నారు. అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్‌లో చెరకు సాగును పూర్తిగా యంత్రీకరణ ద్వారా చేపట్టి రైతులకు ప్రయోజనాలను వివరిస్తామని తెలిపారు.

వరిమాగాణుల్లో అపరాల సాగు లాభదాయకం

మాగాణి భూముల్లో ఖరీఫ్‌లో వరి సాగు తరువాత రబీలో అపరాల సాగును ప్రోత్సహిస్తున్నట్టు డాక్టర్ ముకుందరావు వెల్లడించారు. రబీలో అపరాల పంటను తీసిన తరువాత చెదురుముదురుగా కురిసే వేసవి వర్షాలతో పచ్చిరొట్ట పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. వరి తర్వాత మొక్కజొన్న, నువ్వు పంటల సాగు లాభదాయకంగా ఉన్నందున ఈ పంటలను ప్రోత్సహిస్తామన్నారు. డ్రోన్‌ల ద్వారా పురుగు నియంత్రణ మందుల పిచికారీపైనా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ట్రైకోగామా వంటి మిత్ర పురుగుల సాయంతో క్రిమికీటకాలను నియంత్రించే పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపడతామన్నారు. షుగర్ బీట్ సాగుపై పరిశోధనలు కొనసాగిస్తామని, నానో యూరియా, నానోమిక్స్ వాడకంపై కూడా రైతులకు అవగాహన కల్పించాలని నిర్ణయించినట్టు చెప్పారు. పంటల సాగులో యంత్రాల వినియోగాన్ని ఉద్దేశంతో కస్టమ్ హైరింగ్ సెంటర్‌ల ఏర్పాటు, నాబార్డు సాయంతో స్కిల్ సెంటర్ల ఏర్పాటుకు సహాయమందిస్తాయన్నారు. వ్యవసాయ శాఖ సహాయంతో ఈ కార్యక్రమాలు చేపట్టాలని ఉత్తరాంధ్ర వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశాల్లో తీర్మానాలు చేసినట్టు డాక్టర్ ముకుందరావు తెలిపారు.

అల్లూరి పార్కు సమగ్ర అభివృద్ధి

... 5వ పేజీ తరువాయి

కల్పించడానికి ప్రణాళిక రూపొందించినట్టు తెలిపారు. అల్లూరి జీవిత చరిత్ర వీడియోలను రూపొందించి పాఠశాలల విద్యార్థులకు ప్రత్యేకంగా ప్రదర్శించేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. అల్లూరి పార్కు అభివృద్ధికి విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, రాజ్యసభ సభ్యుడు బీదా మస్తాన్‌రావు చెరో రూ.10 లక్షల చొప్పున ఎంపీ ల్యాడ్స్ నుంచి కేటాయించారని, మిగిలిన ఎంపీలు కూడా త్వరలో నిధులు కేటాయించే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న రూ.20 లక్షలతో ముఖ్యమైన పనులను 15రోజుల్లో చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అయ్యన్నపాత్రుడు వెంట జిల్లా పర్యాటక ఈఈ కె.విజయభాస్కర్‌రెడ్డి, డీఈఈలు ఎస్.జి.సత్యనారాయణ, సీతారామ్, టూరిజం మేనేజర్ సూరెడ్డి అప్పలనాయుడు, జనసేన నర్సీపట్నం నియోజకవర్గం ఇన్‌చార్జ్ రాజాన సూర్యచంద్ర, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్లు రమేశ్, సూర్యచంద్ర, టీడీపీ మండల అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, నాయకులు చిటికెల తారక వేణుగోపాల్, ఆదపురెడ్డి గోపాలకృష్ణ, సాంబమూర్తి, బొడ్డు జమీలు, పెట్ల నారాయణమూర్తి, ఎల్.రమేశ్, రాజులునాయుడు, అప్పలనాయుడు, స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	105.00
లైవ్ ధర	125.00
విత్ స్కిన్	220.00
స్కిన్ లెస్	230.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	510
విజయనగరం	514
శ్రీకాకుళం	514

29 నుంచి కృషి సంకల్ప అభియాన్

రాంబిల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ, భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి ఆదేశానుసారం ఈ నెల 29 నుంచి జూన్ 12 వరకు కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని జిల్లా అంతట నిర్వహిస్తున్నట్టు హరిపురం బీసీటీ కృషివిజ్ఞానకేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శైలజాకుర్రా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధునాతన పద్ధతులు, కొత్త రకాలు, ప్రభుత్వ పథకాలు, డ్రోన్ సాంకేతిక పరిజ్ఞానం, పంటల వైవిధ్యం వంటి విషయాలపై స్థానిక వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో బృందాలుగా ఏర్పడి అభ్యుదయ రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంస్థతో కలిసి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆమె తెలిపారు.

నేడు డిగ్రీ కళాశాలలో మెగా జాబ్‌మేళా

ఎలమంచిలి, మే 14 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో గురువారం ఉదయం 9 గంటల నుంచి మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కొండలరావు తెలిపారు. సుమారు 40 కంటే ఎక్కువ అగ్రశ్రేణి పరిశ్రమల ప్రతినిధులు పాల్గొని వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారని తెలిపారు. ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ పర్యవేక్షణలో నిర్వహించే ఈ జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 10వ తరగతి నుంచి పీజీ వరకు చదువుకుని 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు ఉన్న నిరుద్యోగులు ఈ జాబ్‌మేళాకు హాజరుకావాలన్నారు.

అధిక లోడుతో వస్తున్న లారీలపై ప్రత్యేక దృష్టి

- మాకవరపాలెంలో సామాజిక పింఛన్ల మాయం కేసు త్వరలో కొలిక్కి
- ఇటీవల తూర్పు గోదావరి జిల్లాలో నిందితుల గుర్తింపు
- జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా వెల్లడి



పోలీస్ స్టేషన్ ఆవరణలో సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

మాకవరపాలెం, మే 14 (ఆంధ్రజ్యోతి): అధిక లోడుతో రాకపోకలు సాగిస్తున్న లారీలపై ప్రత్యేక దృష్టి సారించాలని అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా సిబ్బందిని ఆదేశించారు. మాకవరపాలెం పోలీసు స్టేషన్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రసుత్తం రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయన్నారు. మాకవరపాలెంలో మూడేళ్ల క్రితం సామాజిక పింఛన్లకు సంబంధించిన రూ.16 లక్షలు మాయమైందన్నారు. ఈ ఘటనపై అప్పట్లో కేసు నమోదైనట్టు చెప్పారు. ఈ కేసుకు సంబంధించిన నిందితులను ఇటీవల తూర్పు గోదావరి జిల్లాలో గుర్తించినట్టు స్పష్టం చేశారు. తర్వలోనే వారిని పీటీ వారెంట్ ద్వారా మాకవరపాలెం పోలీసు స్టేషనుకు తీసుకువచ్చి, ఇక్కడే కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడిస్తామన్నారు. ఇక్కడున్న ప్రైవేటు కంపెనీకి అధిక లోడుతో వస్తున్న లారీలను తనిఖీ చేయాలని సీఐ రేవతమ్మను ఆదేశించారు. రాజమండ్రి నుంచి ఇసుక లారీలు వస్తున్నాయని, ఇసుక ఎగరకుండా వాటిపై పూర్తిగా పరజా ఉంచేలా అవగాహన కల్పించాలన్నారు. సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చూడాలన్నారు. సిబ్బంది ఎప్పటికప్పుడు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు, రూరల్ సీఐ రేవతమ్మ, స్థానిక ఎస్‌ఐ దామోదర్‌నాయుడు పాల్గొన్నారు.

గోవాడ షుగర్స్ భవిష్యత్తు ప్రశ్నార్థకం!

... 5వ పేజీ తరువాయి

గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో క్రషింగ్ జరుగుతుందో లేదో అని చెరకు నాట్లు వేసిన రైతులు, కార్సీ తోటల రైతులు సందేహాన్ని వ్యక్తం చేస్తున్నారు. వచ్చే సీజన్‌లో చెరకు క్రషింగ్ మెరుగుపడాలంటే ఫ్యాక్టరీ యాజమాన్యం ఇప్పటికే గ్రామాల్లో రైతులతో సమావేశాలు నిర్వహించి, చెరకు క్రషింగ్‌పై భరోసా ఇవ్వాల్సి వుంది. కానీ ఇప్పటి వరకు ఆ దిశగా ఎటువంటి చర్యలు చేపట్టలేదు. చెరకు రైతులతో అగ్రిమెంట్లు కుదుర్చుకోవడం కూడా మొదలు కాలేదు.

ప్రకటనల్లోనే సీఎంతో భేటీ!

గోవాడ షుగర్ ఫ్యాక్టరీని ఆదుకోవడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలుస్తామని ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యేలు కేఎస్ఎన్ఎస్ రాజు, బండారు సత్యనారాయణమూర్తి చాలా రోజులుగా ప్రకటనలు చేస్తున్నారు. వీరు గతంలో హామీ ఇచ్చినట్టు డిస్టిలరీ లేదా ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలంటే ఇందుకు అవసరమైన ముడిసరకు (మొలాసిస్) కోసం చెరకు ఫ్యాక్టరీ రన్నింగ్‌లో వుండాలి. ఈ ప్రాంతంలో చెరకుతోపాటు ఇతర పంటల సాగుచేయించాలి. కానీ డిస్టిలరీ లేదా ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటుపై ప్రభుత్వపరంగా ఇంతవరకు ఎటువంటి సంకేతాలు రాకపోవడంతో గోవాడ షుగర్స్ భవిష్యత్తుపై అనుమానాలు మరింత బలపడుతున్నాయి.

నాడు అక్రమం.. నేడు సక్రమమా?

... 5వ పేజీ తరువాయి

అదే గ్రామానికి చెందిన వైసీపీ మద్దతుదారులైన తొమ్మిది కుటుంబాలకు చెందిన 34 మంది పేర్లను రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయించి, హక్కుదారులుగా నకిలీ పత్రాలు సృష్టించారు. ప్రభుత్వం ఇచ్చే రిటర్న్ ప్లాట్లను కొట్టేయాలన్నది వీళ్ల ప్లాన్. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ, జనసేన, సీపీఎం, సీపీఐ నేతలు కోడూరులో ఆందోళన చేసి భూసమీకరణ మాటున వైసీపీ నేతలు పాల్పడిన అక్రమాలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సీఐడీ అధికారులకు, డీజీపీకి ఫిర్యాదు చేశారు. అక్రమాలకు పాల్పడింది వైసీపీ వారే కావడంతో నాటి పాలకులు ఈ ఫిర్యాదులను బుట్టదాఖలు చేశారు.

ప్రభుత్వం మారినా ఆగని అక్రమాలు

కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత వైసీపీ హయాంలో భూసమీకరణ పేరుతో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించి చర్యలు చేపడతారని అంతా భావించారు. కానీ ఇందుకు భిన్నంగా.. కూటమి పార్టీలకు చెందిన కొందరు నేతలు.. వైసీపీ బినామీలకు నష్టపరిహారం ఇప్పించడం విమర్శలకు తావిస్తున్నది. వాస్తవంగా భూనిర్వాసితులకు నష్టపరిహారం కింద అభివృద్ధి చేసిన స్థలాలు ఇవ్వాలి. భూములిచ్చిన రైతులకు ప్లాట్లు కేటాయించే ముందు గ్రామ సభ నిర్వహించాలి. భూసమీకరణ కింద భూములు ఇచ్చిన రైతుల పేర్లను గ్రామ సచివాలయంలో నోటీసు బోర్డుపై పెట్టాలి. కానీ వీటిని రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. పైగా కూటమిలో ఒక పార్టీకి చెందిన నేత, వైసీపీకి చెందిన మరో నేతతో కుమ్మక్కై భూములు ఇచ్చిన రైతులకు (నకిలీలు) ప్లాట్‌లు కాకుండా భూసేకరణ చట్టం కింద డబ్బులు చెల్లించేలా పావులు కదిపారు. మొత్తం తొమ్మిది కుటుంబాలకు చెందిన 34 మందికి ఎకరాకు రూ.20 లక్షల చొప్పున సుమారు రూ.6.27 కోట్లు విడుదల ఈ నెల 10న విడుదల చేశారు. అనకాపల్లికి చెందిన కూటమి నేత ఒత్తిళ్లతకు తలొగ్గి జిల్లా అధికారి ఒకరు నష్టపరిహారం ఫైలుపై సంతకం చేసినట్టు తెలిసింది. సదరు కూటమి నేత.. అటు నకిలీ రైతులు, ఇటు రెవెన్యూ అధికారులు, వైసీపీ నేతలను సమన్వయం చేసుకొని ఎటువంటి ఫిర్యాదులు అందకుండా మేనేజ్ చేసినట్టు సమాచారం. ఈ వ్యవహారంలో భారీ ఎత్తున డబ్బులు చేతులు మారినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కోడూరులో ఏపీఐఐసీకి చెందిన ప్రభుత్వ భూములకు బినామీ రైతులకు పరిహారం చెల్లింపుపై అనకాపల్లి ఇన్‌చార్జి ఆర్డీఓ శ్రీనివాసరావును వివరణ కోరగా.. ఈ చెల్లింపులు జరిగిన తరువాత ఇన్‌చార్జి బాధ్యతలు చేపట్టానని చెప్పారు. కోడూరులో ఎన్ని ఎకరాలు సేకరించారు? ఎంత మంది రైతులకు నగదు పరిహారం ఇచ్చారు? అన్న వివరాలు తన వద్ద లేవన్నారు. కొద్ది రోజులు గడువిస్తే వివరాలు తీసుకొని ఇస్తానని చెప్పారు.